తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
25 ఆగష్టు 2026
పేజీలు : 8

# ఖమ్మం జిల్లాలో ఒకే రోజు లక్ష మొక్కలు

○ మంత్రి కొండా సురేఖ ఆదేశం ?

○ సెప్టెంబర్ చివరి వారంలోగా 100 శాతం లక్ష్యసాధన





**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (జనం సాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం?2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని తన ఛాంబర్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వన మహోత్సవం లక్ష్యసాధనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 56 శాతం మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించలేకపోయామని, ఇకపై కురిసే వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటూ సెప్టెంబర్ చివరి వారం నాటికి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నందున గుర్తించిన ప్రాంతాల్లో అనువైన మొక్కలను నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి మొక్కను సంరక్షించి బతికేలా చూడాలని అన్నారు. పశువులు, జంతువుల నుంచి మొక్కలను కాపాడేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేయాలని తెలిపారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వన మహోత్సవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలో 17.78 లక్షల మొక్కల నాటకంజిల్లా కలెక్టర్ కుమార్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో వన మహోత్సవం?2026లో భాగంగా 24.66 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 17.78 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాన్ని సాధించేలా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా తోట లక్ష్మీకాంతారావు బాధ్యతల స్వీకరణ

**నిజాంసాగర్, ఆగస్టు 24 జనంసాక్షి :** తెలంగాణ శాసనసభ మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా జుక్కల్ శాసనసభ్యులు శ్రీ తోట లక్ష్మీకాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మైనారిటీ వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని తోట లక్ష్మీకాంతారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలి

తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు

వార్తా లోపలి పేజీలో



## కౌమారదశలోని విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలి

బాల్య వివాహాలతో నష్టాలపై వివరించాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్

మిగతా 13లో

## నిజాంసాగర్ ప్రాజెక్టులో 12.614 టీఎంసీల నీటి నిల్వ

**నిజాంసాగర్, ఆగస్టు 24 జనంసాక్షి :** నిజాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1401.12 అడుగుల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 12.614 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,687 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అయితే ప్రాజెక్టు నుంచి ఎలాంటి నీటిని విడుదల చేయడం లేదు. ప్రధాన కాలువ, స్పిల్‌వే గేట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదల శూన్యంగా ఉంది.



# గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ ను సస్యశ్యామలం చేస్తా

○ భూసేకరణ వేగవంతం 250కోట్ల నిధులు మంజూరు...

○ కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలి...

○ ఓగులాపూర్ లో చెక్ డ్యామ్ నిర్మాణానికి కృషి...

○ గతంలో సేకరించిన భూమిపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం..

○ విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం...

○ పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్..




**చిగురుమామిడి ఆగస్టు 24 (జనంసాక్షి):** గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమంలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, ఓగులాపూర్,గునుకులపల్లి గ్రామాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించి అభివృద్ధి,ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో మంత్రి పొన్న ప్రభాకర్ పర్యటించారు. భూ సేకరణకు వేగవంతం చేసే దిశగా 250కోట్లు నిధులు మంజూరు చేశామని, కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలని, రైతులు అధిక దిగుబడి నిచ్చే ఆయిల్ ఫామ్ ను సాగు చేయాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకెళ్లాలని కోరారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు పోటీ పడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపుతో ఆయిల్ ఫామ్ సాగు పెద్ద ఎత్తున రైతులు ముందుకు వచ్చారు. సోలార్ విద్యుత్తో ఆదావవుతుందని,సబ్సిడీ షెడ్యూల్ చేసుకోవాలని చెప్పారు. గునుకులపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు కృషి చేస్తానని,అంగన్వాడి సెంటర్ మంజూరు చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం పేరుతో సేకరించిన భూములకు సంబంధించిన అంశాన్ని రైతులతో కలిసి చర్చించి పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముంపున గురైన భూముల్లో పండించిన దానియాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు,రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామంలో

మిగతా 13లో

## తుక్కోజివాడిలో ఉచిత వైద్య శిబిరం



సదాశివనగర్ ఆగస్టు 24 (జనంసాక్షి)సదాశివనగర్ మండలం తుక్కోజివాడి గ్రామంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగారావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 జనం సాక్షి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## 1వ వార్డులో ఘనంగా వన మహోత్సవం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (జనం సాక్షి)కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 1వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రజలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తే పట్టణాన్ని మరింత పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ హన్మాంతారావు, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, అంజాద్, యూనస్, సిద్దిక్, కాళ్ల గణేశ్, చిట్టిబాబు, నాయకులు సంతోష్, సుధాకర్, సాయిలు, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి యూరియా స్టాక్ అప్‌డేట్ అసలు కథేంటి



సిరికొండ, ఆగస్టు 24 (జనం సాక్షి): సిరికొండ మండలంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రిటైలర్ల వద్ద యూరియా స్టాక్‌ను ఆన్‌లైన్‌లో అర్ధరాత్రి సమయంలో అప్‌డేట్ చేస్తున్న విధానంపై సిరికొండ మండల కిసాన్ మోర్చా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు అందజేశారు.యూరియా స్టాక్‌ను అర్ధరాత్రి సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం వల్ల సాధారణ రైతులకు ముందస్తు సమాచారం అందడం లేదని, కొంతమంది రైతులకు మాత్రమే సమాచారం చేరుతున్న పరిస్థితి ఉందని కిసాన్ మోర్చా నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో స్టాక్ వివరాలు అందరికీ ఒకే సమయంలో తెలిసేలా పారదర్శక విధానం ఉండాలని కోరారు.యూరియా స్టాక్ అప్‌డేట్‌కు నిర్దిష్ట సమయం కేటాయించాలని, స్టాక్ అందుబాటులోకి వచ్చిన వెంటనే రైతులందరికీ సమానంగా సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైలర్ల వద్ద ఉన్న వాస్తవ యూరియా నిల్వ, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసిన స్టాక్, విక్రయించిన పరిమాణం, విక్రయ సమయాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే స్టాక్ అప్‌డేట్ నుంచి రైతులకు యూరియా విక్రయించే వరకు మొత్తం ప్రక్రియను అధికారులు తనిఖీ చేయాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి వేచి చూస్తున్న పరిస్థితుల్లో కొంతమందికి మాత్రమే ముందస్తు సమాచారం అందే అవకాశం లేకుండా ప్రతి రైతుకు సమాన అవకాశంతో యూరియా అందేలా చూడాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో అందజేసిన ఫిర్యాదుపై అధికారులు వెంటనే స్పందించి, యూరియా స్టాక్ అప్‌డేట్, నిల్వలు, విక్రయాలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిరికొండ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పాల్గొని యూరియా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైంది



సిరిసిల్ల టౌన్ ఆగస్టు 24 (జనం సాక్షి)ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని చేనేత చౌక్ వద్ద విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని డిమాండ్ చేస్తూ బి,ఆర్,ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.విద్యార్థుల భోజనంలో పురుగులు రావడంపై ప్రశ్నించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం బెదిరించడం దురదృష్టకరమని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు విద్యార్థులను భయపెట్టడం సిగ్గుచేటన్నారు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేని పరిస్థితి ఉంటే.. రాష్ట్రంలోని మిగతా విద్యార్థుల పరిస్థితి ఏమిటి?" అని కంచర్ల రవి గౌడ్ ప్రశ్నించారు.విద్యార్థుల భోజనంలో నిర్లక్ష్యానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం తక్షణమే ఆపాలని కోరారు.ఇదేనా ప్రజా పాలన.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని ప్రశ్నించిన కంచర్ల రవి గౌడ్, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, హర్షిత్, స్వాతిక్, విష్ణు, వినయ్, రిషిత్, అభి, సిద్ధార్థ, సాయి, నవీన్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



జమ్మికుంట, ఆగస్టు 24 (జనం సాక్షి): జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న 27 మంది మహిళ పారిశుద్ధ కార్మికులకు సోమవారం రోజున హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్,మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దీలీప్) ,కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి గారల చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా రిటైర్ అయి తల్లి పేరున గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు,సమాజంలోని పేదలకు అనేక సేవా కార్యక్రమాలు తన పెన్షన్ డబ్బులు నుండి నిర్వహించడం గర్వించదగిన విషయమని అన్నారు. అనంతరం తమ మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేసినందుకు అభినందనలు తెలుపుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో కొనసాగించాలని ఆ కార్యక్రమాలలో తాము పాల్గొంటామని ఈ సందర్భంగా తెలిపారు.ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక లాంటి వారని,ప్రతిరోజు ఉదయము వీధులను,డ్రైనేజీలను శుభ్రపరుస్తూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఎలాంటి వ్యాధులు రాకుండా చేస్తున్న వీరి సేవలు అమూల్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ గుర్రం కావ్య పరశురాములు,శీలం శ్రీనివాస్, కొలుగూరి సురేష్ ,శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమేష్,సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి,కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి మరణం పేద ప్రజలకు తీరని లోటు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24, ( జనం సాక్షి)**సీపీఎం సీనియర్ నేత, రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి (88) మృతి పేద ప్రజలకు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయం ఎదుట పార్టీ జెండాను అవనతం చేసి మల్లారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మల్లారెడ్డి తుదిశ్వాస విడిచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, వ్యవసాయ, నీటిపారుదల రంగాల్లో విశేష అనుభవం కలిగిన నాయకుడని కొనియాడారు. కరీంనగర్ జిల్లాలో రైతు ఉద్యమాలు, పేదల ఇళ్ల స్థలాల పోరాటాలు, భూ నిర్వాసితుల ఆందోళనలు, ప్రాజెక్టుల సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. మల్లారెడ్డి మృతికి సీపీఎం జిల్లా కమిటీ తరఫున సంతాపం ప్రకటిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.






ఆయన ఆశయాల స్ఫూర్తితో ప్రజా పోరాటాలను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గిట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, ఉప్పునూటి శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ నుంచి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా

**మెట్‌పల్లి,ఆగస్టు 24(జనం సాక్షి )**ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ఏశమేని గణేష్‌ను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డా. బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తోటి జర్నలిస్ట్‌గా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చిన ఏశమేని గణేష్ ఇప్పుడు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని డా. బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ అన్నారు. జర్నలిజం రంగంలో పనిచేస్తూనే కార్మికుల సమస్యలపై అవగాహన కలిగి ఉండటం, వారి హక్కుల కోసం పోరాడే బాధ్యతను స్వీకరించడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్షుడిగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని, తన బాధ్యతలను



విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు ఏశమేని గణేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుండ్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ , అప్పం చిన్నారెడ్డి, తేలుకంటి గంగాధర్, అజ్మీరి గంగాధర్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుల 48 గంటల దీక్ష ప్రారంభం

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24, ( జనం సాక్షి)**గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 48 గంటల దీక్షను సీఐటీయూ జిల్లా కార్యదర్శి గిట్ల ముకుందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెరగలేదని, అదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులందరికీ పీఎఫ్,




ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే ప్రభుత్వం రూ. 20 లక్షల ప్రమాద బీమా అందించాలని, కార్మికులందరినీ రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కనీస వేతనంగా నెలకు రూ. 26 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వేధింపులను అరికట్టాలని అన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించి గ్రామపంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ముకుందరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, కమిటీ సభ్యులు కాష్పాక శంకర్, ఎలకపల్లి సారయ్య, దాసరపు వెంకటేష్, రామానుజన్, మేకల కమలాకర్, ప్రేమ్ కుమార్, వడ్లూరి లత, స్వరూప, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సమయపాలన పాటించాలి

**ముస్తాబాద్ ఆగస్టు 24 (జనం సాక్షి)**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులే తూట్లు పొడుస్తున్నారు. సామాన్యుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజావాణి నిర్వహించాలని నిబంధన. కానీ అధికారులు 11:00 గంటలకు అయిన రావడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. 30 శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా 20 శాఖల అధికారులే హాజరు కావడం గమనార్హం. ప్రజావాణికి సమయపాలన పాటించని అధికారులపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కమలాకర్ శర్మ పంతులు ఇక లేరు



**ముస్తాబాద్ ఆగస్టు 24 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కమలాకర్ శర్మ పంతులు, గంభీరావుపేట మండలం మల్లారెడ్డి పేట గ్రామంలో పూజారి అయినటువంటి కమలాకర్ శర్మ పంతులు హార్ట్ స్ట్రోక్ తో మరణించడం జరిగింది. వారికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజి రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు రాచ మడుగు సంతోష్ రావు, ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి పార్టీ నాయకులు కోడె శ్రీనివాస్ తాళ్ల రాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ర్యాంపును తొలగించాలని కాలనీవాసుల ఫిర్యాదు

**ఆర్మూర్,ఆగస్ట్ 24(జనంసాక్షి):**ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ఆర్టీసీ కాలనీలో అనధికారికంగా ప్రకాష్ అనే వ్యక్తి నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడని,రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న ర్యాంపును తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను నిర్మిస్తున్న ఇంటికి తూర్పు వైపున 20 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. రోడ్డును సైతం ఆక్రమించి ర్యాంపు నిర్మాణం చేపట్టి కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత వారం రోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు ఇచ్చిన సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం.

## కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కుచులకంటి శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**జనం సాక్షి ఎల్లారెడ్డి ఆగస్టు 22:** ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కుచులకంటి శంకర్ జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమసాయిబాబా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శంకర్ కు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ కుచులకంటి శంకర్ పార్టీ కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నాయకత్వంలో యువ నాయకులకు పార్టీలో మంచి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దశ దినకర్మలో పాల్గొన్న ఈరావత్రి రాజశేఖర్



**ఆర్మూర్,ఆగస్ట్ 24 (జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బామర్ది స్వర్గీయ జోగినిపల్లి శ్రీనివాసరావు దశ దినకర్మలో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సోమవారం పాల్గొన్నారు.హైద్రాబాద్ లోని కొంపల్లి ఆస్పిషియస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి చైర్మన్ ఈరావత్రి రాజశేఖర్,సభ్యులు అర్గుల్ సురేష్,నూకల శేఖర్,నిజామాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు తో కలిసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు,కెసిఆర్ మేనల్లుడు జోగినిపల్లి సంతోష్ రావు,కెటిఆర్ కుమారుడు హిమాంశు రావు,తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్ ను కలిశారు.

## పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎస్పీకి మర్యాదపూర్వక భేటీ



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిఆగస్టు 24 (జనం సాక్షి)**కామారెడ్డి జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కే. రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో వైస్ ప్రెసిడెంట్లు బి. సంతోష్ కుమార్, పి.ఎన్. సాయి ప్రసన్న, సెక్రటరీ తులా శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కే. మధుకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్. శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్. సాయిలుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎస్పీని కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర నూతన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, అధికారులు మరియు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు.నూతన కార్యవర్గం పోలీస్ అధికారుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా సభ్యులు తెలిపారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయానికి స్థలాన్ని ఇచ్చిన వెంకటేష్



**చిట్టాపూర్ న్యూస్ 24 ఆగస్టు (జనం సాక్షి)** తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బిజెపి నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిజాంబాద్ జిల్లాలోని బాల్కొండ మండల కేంద్రంలో ఉన్నటువంటి చిత్తాపూర్ గ్రామంలో లింగన్న పాటిల్ గారి పుత్రుడు వెంకటేష్ గౌడ సంఘం సభ్యులకు రేణుక ఎల్లమ్మ గుడి కోసం తన సొంత స్థలాన్ని కేటాయించడం జరిగిందనీ తెలియజేశారు .వెంకటేష్ గారికి రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ఉండాలని సంఘ సభ్యులు ప్రజలు అందరూ కోరుకున్నారు అదేవిధంగా ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ఉండాలని గౌడ సంఘం సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం




**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24, ( జనం సాక్షి)**ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన 24 గంటల ఆటోల బంద్ విజయవంతమైంది. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలతో పాటు కరీంనగర్ నగరంలోని ఆటో స్టాండ్ల అధ్యక్షులు, నాయకులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. కరీంనగర్ బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆటోలు నిలిచిపోయాయి.ఆటో డ్రైవర్ల డిమాండ్లు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో సందేశం ద్వారా వెల్లడించినప్పటికీ, హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సంఘం నాయకులు కోరారు. ప్రభుత్వం తక్షణమే డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది ఆటో డ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారని, కరీంనగర్ జిల్లాలో సుమారు 14 వేల ఆటోలు ఉన్నాయని నాయకులు తెలిపారు. కరీంనగర్ నగరం, పరిసర గ్రామాల నుంచి సుమారు 7 వేల ఆటోలు నడుస్తున్నాయని, వాటిపై వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఎలక్ట్రికల్ ఆటోలను ప్రవేశపెట్టే నిర్ణయాన్ని రద్దు చేయాలని, రాపిడో, ఓలా, ఉబర్‌లలో టూ వీలర్ బైక్ సేవలను నిలిపివేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గతంలో మాదిరిగానే ఆటో లైసెన్సులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.బంద్‌లో మహిళా ఆటో డ్రైవర్లుకరీంనగర్ టౌన్‌లో నలుగురు మహిళలు ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి పొందుతున్నారని సంఘం నాయకులు తెలిపారు. వారిలో మహిళా ఆటో డ్రైవర్లు కూడా 24 గంటల బంద్‌లో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ప్రయాణికులకు ఇబ్బందులుఆటోల బంద్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డారు. బంద్‌కు సహకరించిన ఆటో డ్రైవర్లు, ప్రజలకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చెలుమల్ల రామచంద్రం, ప్రధాన కార్యదర్శి బందారి సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు కొత్తూరి సత్యనారాయణ, ఇరవేణి కుమార్, కుకట్ల సంపత్, కోశాధికారి చిట్టిమల్ల నాగభూషణం, సహాయ కార్యదర్శులు వడ్లకొండ శ్రీనివాస్ గౌడ్, వాల్క రమేష్, మీర్జా అఫ్జల్ బేగ్, మారం సంపత్, మహమ్మద్ యాకూబ్, కార్యవర్గ సభ్యులు కూర్మాచలం వేణుమాధవ్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆటో అధ్యక్షులు అంతగిరి సంపత్, వి.పార్క్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (జనం సాక్షి)గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ నాయకుడు కందారపు రాజనర్సు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు పంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 53 వేల మంది పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్యంతో పాటు ప్రజలకు వివిధ సేవలు అందిస్తున్నారని రాజనర్సు తెలిపారు. ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, పర్మినెంట్ హోదా, కనీస వేతనాలు, పీఆర్సీ, ప్రమాద బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పంచాయతీ కార్మికులను అక్రమంగా తొలగించే సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేయాలని, వేతనాలు పెంచాలని, రెండో పీఆర్సీలో పంచాయతీ కార్మికులకు గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలుగా నిర్ణయించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వేతనాలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనారోగ్యానికి గురైన, వయోభారం కారణంగా పనిచేయలేని లేదా మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు అంత్యక్రియల ఖర్చుతో పాటు కనీసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.బిక్కనూర్, లింగంపేట మండలాల్లో మరణించిన పంచాయతీ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి రూ.10 లక్షల ప్రమాద బీమా అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అదేవిధంగా పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాల్ నర్సు, మాచారెడ్డి మండల అధ్యక్షుడు సాయిలు, పాల్వంచ మండల అధ్యక్షుడు బాల్ నర్సు, నాయకులు కిషన్, లక్ష్మీనరసింహులు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేసే వారి ఇళ్ల ముందు డప్పుల దండోరా



గన్నేరువరం,ఆగస్టు24 (జనంసాక్షి):మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై తప్పుడు ఆరోపణలు చేసే వారి ఇళ్ల ముందు డప్పులతో దండోరా మోగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గన్నేరువరం మండలశాఖ అధ్యక్షుడు మాతంగి అనిల్ హెచ్చరించారు. సోమవారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణ చేస్తూ ఆయన ప్రతిష్టకు గౌరవానికి భంగం కలిగించే వారిని వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. సంబంధం లేని విషయాలను ఎమ్మెల్యే కు ఆపాదిస్తూ ఆయనపై తప్పుడు ప్రచారాలు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియా సహా ఏ వేదికలో ఆరోపణలు చేసినా వాటిని నిరూపించకుంటే వారిని ప్రజల ముందు దోషిగా నిలబెడతామని మాతంగి అనిల్ హెచ్చరించారు. చేసిన ఆరోపణలు నిరూపించక పోతే బాధ్యుల ఇంటి ముందు డప్పుల దండోరాతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.ఈ విలేకర్ల సమావేశంలో దళిత నేతలు లింగంపల్లి శ్రీకాంత్ నేత జీవన్ మహంకాళి మల్లయ్య న్యాత నరేష్ , దేశ రాజ అనిల్, రాపోలు నవీన్ , కొంకటి జయప్రకాష్, బుర్ర తిరుపతి , పెంకర్ల ప్రశాంత్, వెదరే తిరుపతి, చంద్రమౌళి రాపోలు హరీష్ , పాకాల పర్శరాములు, , అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్‌పేట యువకుల సాహసం స్ఫూర్తిదాయకం



**మంథని, ఆగస్టు 24, (జనంసాక్షి ) :** పదకొండు రోజుల క్రితం మంథని పట్టణంలోని బొక్కలవాగులో మునిగిపోయిన బాలికను రక్షించిన యువకుల సాహసం స్ఫూర్తిదాయకమని మంథనిమాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రాజగృహాలో బోయిన్‌పేటకు చెందిన అంకం రాజశేఖర్, ఆకుల అరవింద్ అనే ఇద్దరు యువకులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బోయిన్‌పేటకు చెందిన పర్శవేన రాజు యాదవ్ అలియస్ ఆర్‌కే యాదవ్ గొర్లను మేపుకుంటూ బొక్కలవాగు దాటే క్రమంలో వాగులో మునిగిపోయాడని, నీటిలో మునిగిపోతున్న తండ్రిని కాపాడేందుకు ప్రయత్నం చేసిన ఆయన కూతురు సైతం నీటిలో మునిగిపోయిందని తెలిపారు. నీటిలో మునిగిపోతూ కేకలు వేయడంతో సమీపంలోని గోదాంలో పనికి వెళ్తున్న అంకం రాజశేఖర్, ఆకుల అరవింద్‌లు బాలిక కేకలు విని ఆలస్యం చేయకుండా వాగులోకి దూకి తమ ప్రాణాలు లెక్కచేయకుండా బాలిక ప్రాణాలు కాపాడారని తెలిపారు. బాలికను రక్షించేందుకు ఇద్దరు యువకులు అత్యంత సాహసం చేశారని ఆయన కొనియాడారు. ఈనాడు యువత చెడుమార్గాల వైపు పయనిస్తుంటే ఇద్దరు యువకులు మాత్రం గొప్ప సాహసం చేసి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అలాగే ప్రస్తుత పరిస్తితుల్లో ప్రతి ఒక్కరు ఈత నేర్చుకోవాలని, అత్యవసర పరిస్తితుల్లో ఈత ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని ఆయన తెలిపారు. అనంతరం సాహసం చేసిన యువకులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.

# పాఠశాలకు వచ్చామా నిద్రపోయామా టైం అయ్యిందా వెళ్లిపోయామా




ముత్తారం ఆగస్టు 24(జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బోధన అందించాల్సి ఉంటుంది. అయితే ముత్తారం ప్రభుత్వ పాఠశాలలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ ఉపాధ్యాయురాలు పాఠశాల సమయంలోనే నిద్రపోతున్నారంటూ వారు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడం లేదని, తమ పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యతో నిద్రపోతున్నారంటూ సంబంధిత ఉపాధ్యాయురాలు కొంతకాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని, విధి నిర్వహణ సమయంలో పాఠశాలలోనే విశ్రాంతి తీసుకుంటూ నిద్రపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్య పరిస్థితి కారణంగా బోధన చేయలేని పరిస్థితి ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఒకవైపు ఉపాధ్యాయురాలి ఆరోగ్య పరిస్థితిపై సానుభూతి వ్యక్తం చేస్తూనే.. మరోవైపు దాని ప్రభావం విద్యార్థుల చదువుపై పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాఠాలు చెప్పేదెప్పుడు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు నిర్ణీత సమయానికి తరగతులు నిర్వహించి, సిలబస్ పూర్తి చేయడంతో పాటు వారి విద్యా ప్రగతిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుంది. అయితే ఉపాధ్యాయురాలు ఆరోగ్య సమస్యతో పాఠశాలలోనే నిద్రపోతున్నారనే ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులకు బోధన పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'పాఠశాలకు వచ్చామా.. నిద్రపోయామా.. టైం అయ్యిందా.. వెళ్లిపోయామా' అన్నట్లుగా పరిస్థితి మారిందని కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్తకు పాఠశాలలోనే భోజనం ఇదిలా ఉండగా పాఠశాల ప్రాంగణంలోనే ఉపాధ్యాయురాలు తన భర్తకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట సామగ్రి, ఇతర వనరులను వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాల వనరులు వ్యక్తిగత అవసరాలకు వినియోగించారా? లేదా? అనే విషయాన్ని అధికారులు విచారణ ద్వారా తేల్చాలని వారు అంటున్నారు. విద్యార్థుల భోజనంపైనా ఆరోపణలు మరోవైపు విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్న భోజనంపైనా తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు భోజనం సక్రమంగా అందుతుందా? నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? పాఠశాలకు కేటాయించిన ఆహార పదార్థాలు నిబంధనల ప్రకారమే వినియోగిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర తనిఖీ చేయాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షణ పెంచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు

# పునరుత్పాదక వ్యవసాయంపై రైతులకు అవగాహన



**ముత్తారం ఆగస్టు 24(జనంసాక్షి):** పునరుత్పాదక వ్యవసాయ పద్ధతులపై ముత్తారం మండలం హరిపురం గ్రామంలోని రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంటల సాగులో వైవిధ్యాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులు పొలాల్లో అంతర పంటలు, రక్షక పంటలు,ఎర పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవ డంతో పాటు పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే ఆగ్రోఫారెస్ట్రీ పద్ధతిని అవలంబించి పండ్ల చెట్లను నాటుకోవాలని తెలిపారు .తప్పనిసరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూసారం,పంట దిగుబడులను మెరుగు పరుచుకోవచ్చున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పక్షులు, నీటిలోని జీవరాశులు, ఇతర సహజ జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకోవాలని రైతులకు సూచి ంచారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు రైతులకు దీర్ఘ కాలికంగా ప్రయోజనం చేకూరుతుందని వివరి ంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెంగని సమత తిరుపతి,ఉపసర్పంచ్ కూస తిరుపతి పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ కోసం గీత కార్మికులకు ఐడీ కార్డుల పంపిణీ




**ఇల్లంతకుంట ఆగస్టు 24(జనంసాక్షి )**మండల కేంద్రంలోని 11 మంది గీత కార్మికులకు పెన్షన్ దరఖాస్తుల కోసం సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాస్ గీత కార్మిక ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 50 సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన గీత కార్మికులు ఐడీ కార్డు కలిగి ఉంటే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని గీత కార్మిక సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై బత్తిని ప్రణీత్ గౌడ్, ఇల్లంతకుంట గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్ గౌడ్, కోశాధికారి ముంజ భాస్కర్, సారా రమేష్, కొయ్యడ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పాపహరేశ్వర ఆలయంలో శ్రావణమాసం పూజలు



**పెద్ద కొడప్గల్ ఆగస్టు 24 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఆలయమైన శ్రీ పాప హరేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శివయ్యను దర్శించుకున్నారు. దాత శివకుమార్ పటేల్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పురోహితుడు శ్రీపాదరావు జోషి మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నట్లు, దాతల సహకారంతో నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న దేగాం సర్పంచ్ లింగారెడ్డి



**ఆర్మూర్,ఆగస్ట్ 24(జనంసాక్షి):**ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన సింధుల సుమన్‌కు చెందిన పర్సు ఆదివారం రాత్రి పోయింది. పర్సులో సుమారు రూ.5000 నగదుతో పాటు ఆధార్ కార్డు,పాన్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. పర్సు పోవడంతో సుమన్ ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో దేగాం సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డికి పర్సు లభించగా, అందులోని వివరాల ఆధారంగా యజమాని సింధుల సుమన్‌ను గుర్తించారు. అనంతరం పర్సులో ఉన్న నగదు, డాక్యుమెంట్లతో సహా సుమన్‌కు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సుమన్ సర్పంచ్ లింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న పర్సును తన సొంత సొత్తుగా భావించకుండా,గుర్తించి తిరిగి అప్పగించడం ద్వారా సర్పంచ్ లింగారెడ్డి నిజాయితీ,మానవత్వాన్ని చాటుకున్నారని గ్రామస్థులు అభినందించారు.

## ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



**హుజురాబాద్, ఆగస్టు 24 ( జనం సాక్షి )** :ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామని,అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని వారి ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహారదీక్ష స్థలిని ప్రణవ్ సందర్శించారు.అనంతరం నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాలను మరల న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని,జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ను హాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెద్ద కొడప్గల్ ప్రజావాణికి 5 ఆర్జీలు



**పెద్ద కొడప్గల్ ఆగస్టు 24 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రజావాణికి 5 ఆర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంఈఓ ప్రవీణ్ కుమార్, ఎంఏఓ కిషన్, ఐకేపీ ఏపీఎం సాయిలు తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుకు ఘన సన్మానం



**కమాన్ పూర్, ఆగస్టు 24, (జనంసాక్షి)** : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల తాసిల్దార్ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ నాయకులు ఇనగంటి రామారావు, పిట్ల గోపాల్ లు పుష్పగుచ్చాన్ని అందజేసి పూలమాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూర అంజి, అంబీరు , చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలో మొక్కలు నాటిన నాయకులు

**మేడిపల్లి,ఆగస్టు 24 (జనంసాక్షి):**జగిత్యాల జిల్లా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా, మంతెన మహిపాల్ రెడ్డి భవిత దంపతుల కుమారుడు మంతెన రియాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఎల్లమ్మ దేవాలయం మరియు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మొక్కను నాటారు.వర్షం కురుస్తున్న ప్పటికీ ప్రకృతిపై ప్రేమతో మంతెన రియాన్స్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడం అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, తన కుమారుని పుట్టినరోజును ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా ప్రకృ తికి అంకితం చేస్తూ మొక్కలు నాటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చాలా రోజులుగా ఈ కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్నామని, ఇకపై ప్రతి పుట్టినరోజు సందర్భంగా తమ పిల్లల చేత మొక్కలు నాటించి వాటిని సంరక్షించేలా ప్రోత్సహి స్తామని తెలిపారు.ఈ ప్రకృతి మనకు



ఎంతో ఇచ్చిందని మనం ప్రకృతికి ఎంత చేసినా తక్కువే అని ప్రతి పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటి, దాన్ని పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలి" అని మంతెన మహిపాల్ రెడ్డి అన్నారు.ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి, సలహాదారు మజీద్, కోఆర్డినేటర్ నందు, గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని శీను, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నూతిపెల్లి బూమయ్య, ఆలయ పూజారి చిట్టి పంతులు, కో ఆప్షన్ సభ్యులు హైమద్, చెలిమెల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తునూర్ సొసైటీలో ఇష్టారాజ్యం

**సదాశివనగర్ ఆగస్టు 24 (జనంసాక్షి)**రైతులకు ఎరువులు అందించాల్సిన సహకార సంఘంలో నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే ఆదివారం.. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రాత్రికి రాత్రే ఎరువుల స్టాక్‌ను యాప్‌లో నమోదు చేయడంపై ఉత్తునూర్ సొసైటీ పరిధిలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం సొసైటీ గోదాం వద్దకు చేరుకున్న రైతులు చైర్మన్, కార్యదర్శి, సిబ్బందిని నిలదీశారు.ఎరువుల స్టాక్ అందుబాటులోకి వచ్చిన విషయం రైతులకు ముందస్తుగా ఎందుకు తెలియజేయలేదని, రాత్రివేళ హుటాహుటిన యాప్‌లో స్టాక్ నమోదు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని రైతులు ప్రశ్నించారు. సమాచారం లేకుండా స్టాక్ నమోదు చేయడం వల్ల కొంతమంది రైతులకు మాత్రమే ముందస్తు సమాచారం చేరుతుందనే అనుమానాలు వ్యక్తం చేశారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, పోలీసులు హుటాహుటిన సొసైటీ, రైతు వేదిక వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి తీరుపై మండల



వ్యవసాయాధికారి సీరియస్ అయినట్లు రైతులు తెలిపారు. "నాకు సమాచారం ఇవ్వకుండానే యాప్‌లో స్టాక్ ఎలా నమోదు చేస్తారు?" అంటూ వ్యవసాయాధికారి ప్రశ్నించినట్లు సమాచారం .రైతులకు తెలియకుండా స్టాక్ నమోదు ఎందుకు ప్రభుత్వం ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం యాప్ విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ, స్థానికంగా రైతులకు సమాచారం అందకపోతే ఆ విధానం ఉద్దేశమే దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్టాక్ ఎప్పుడు నమోదు చేశారు? ఎంత స్టాక్ నమోదు చేశారు? అన్నదాతల ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు పూర్తి సమాచారం ఇవ్వడం, స్టాక్ వివరాలను పారదర్శకంగా వెల్లడించడం సొసైటీ బాధ్యత అని రైతులు పేర్కొంటున్నారు. తమకు తెలియకుండా జరిగే వ్యవహారాలతో రైతుల్లో అనుమానాలు పెరుగుతున్నాయని, సొసైటీ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.రైతులకు ఎరువులు అందించాల్సిన సొసైటీలోనే రైతులకు సమాచారం లేకుండా వ్యవహారాలు సాగితే ఇక పారదర్శకత ఎక్కడ?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తునూర్ సొసైటీలో అసలు ఏం జరుగుతుందో ఉన్నతాధికారులు నిగ్గు తేల్చాలని, స్టాక్ నమోదు నుంచి పంపిణీ వరకు మొత్తం ప్రక్రియను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పాఠశాల యధావిధిగా కొనసాగించాలంటూ వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

**వీణవంక ఆగస్టు 24( జనం సాక్షి)**వీణవంక మండలంలోని ఘన్ముకుల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ ను సోమవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ హరి ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశార. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది అంటూ ఫిర్యాదు రాగా,వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్,ట్రైనీ కలెక్టర్ ను పాఠశాల పరిశీలన పంపించడం జరిగింది.పాఠశాల పరిశీలన అనంతరం ట్రైని కలెక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ సూచన మేరకు పాఠశాలను పరిశీలించడం జరిగిందని,పాఠశాల వివరాలను జిల్లా కలెక్టర్ కు అందజేయడం జరుగుతుందన్నారు .పాఠశాలను యధావిధిగా కొనసాగించాలంటూ, ట్రైనీ కలెక్టర్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. హైస్కూల్లో విద్యార్థుల శాతం తగ్గడానికి ప్రధాన కారణం మోడల్ స్కూల్, ప్రైవేట్ స్కూల్ సమీపంలో ఉండడం వల్లే, విద్యార్థుల సంఖ్య తగ్గిందని ,గ్రామంలో హైస్కూల్ ను యధావిధిగా కొనసాగించాలని, విద్యార్థుల సంఖ్య పెంపుకు ఉపాధ్యా



యులతో పాటుగా,గ్రామ సర్పంచ ్,గ్రామస్తులం పాటుపడతామని కలెక్టర్ ను కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ గాజుల శంకర్,ట్రైని కలెక్టర్ కు పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. ఈ పరిశీలనలో ట్రైనీ కలెక్టర్ తో పాటుగా గ్రామ సర్పంచ్ గాజుల శంకర్,ఉప సర్పంచ్ అనిల్ రెడ్డి,మాజీ ఎంపిటిసి సంజీవరెడ్డి,ఫ్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి,మండల విద్యాధికారిణి శోభారాణి,పాఠశాల ప్రధానోపా ధ్యాయులుఇన్స్పెక్టర్ ,ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలి మృతి కేసు ఛేదింపు



**సైదాపూర్ ఆగస్టు 24 (జనం సాక్షి)** సైదాపూర్ పోలీస్ స్టేషన్లో సోమవారం రూరల్ సీఐ శ్రీనివాస్ ఎస్సై స్వాతి విలేకరుల సమావేశం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ ఎలా బోతారం గ్రామంలో తల్లి తమ ఇంట్లో చనిపోతే ఇల్లు వదిలి వెళ్లాల్సి వస్తుందనే మూఢనమ్మకంతో వృద్ధురాలైన తల్లిని వ్యవసాయ బావిలో పడవేసి హత్య చేసిన పెద్ద కుమారుడు నూనె సమ్మయ్య, చిన్న కుమారుడు నూనె శ్రీనివాసు సైదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలబోతారం గ్రామానికి చెందిన సుమారు 80 సంవత్సరాల వయస్సు గల వెంకటమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన సంఘటనపై సైదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, వెంకటమ్మకు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలు ఉండటంతో పాటు, సంఘటనకు ముందు సుమారు పది రోజులుగా పక్షవాతం కారణంగా మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉండేది. ఆమె స్వయంగా వంట చేసుకునే పరిస్థితిలో లేకపోవడంతో, ఆమె నలుగురు కుమారులు వంతుల వారీగా భోజనం అందిస్తూ ఆమెను చూసుకునేవారు. ఈ క్రమంలో 05.04.2026న కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చర్చలో, వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉందని, ఆమె తమలో ఎవరి ఇంట్లోనైనా మృతి చెందితే ఆ ఇంటిని వదిలి వెళ్లాల్సి వస్తుందనే మూఢనమ్మకంతో నిందితులు ఆలోచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు నూనె సమ్మయ్య మరియు చిన్న కుమారుడు నూనె శ్రీనివాసు కలిసి వృద్ధురాలిని సమీపంలోని వ్యవసాయ బావిలో పడవేసి హత్య చేయాలని ముందుగా పథకం వేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఇతర కుటుంబ సభ్యులు లేని సమయంలో, నిందితులు వృద్ధురాలిని ఇంటి నుంచి తీసుకెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో పడవేసినట్లు దర్యాప్తులో నిర్ధారణకు వచ్చింది. అనంతరం ఆమె కనిపించడం లేదన్నట్లుగా నిందితులు వ్యవహరించి, ఆమె కోసం వెతుకుతున్నట్లు నటించారు. వాస్తవాలను దాచిపెట్టి, ఆమె ఎక్కడికో వెళ్లి ఉంటుందని పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. పోలీసులు పలుమార్లు గ్రామంలో విచారణ నిర్వహించి, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, వారి ప్రవర్తన మరియు సంఘటనకు సంబంధించిన ఇతర పరిస్థితులను పరిశీలించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. తదుపరి దర్యాప్తులో నిందితుల పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఈ కేసులో సెక్షన్ 194 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం మృతదేహంపై ఇన్క్వెస్ట్ మరియు తదుపరి దర్యాప్తు ప్రక్రియ నిర్వహించడంతో పాటు, దర్యాప్తులో హత్యకు సంబంధించిన అంశాలు వెలుగులోకి రావడంతో 103(1) , 238 తీ/ఎ 3(5) బి.ఎన్.ఎస్ కింద నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు తిరుపతి గౌడ్ పాల్గొన్నారు

# డ్వాక్రా సూపర్ మార్కెట్ అద్దెను పెంచాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**ఎడపల్లి, ఆగస్టు 24 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండల కేంద్రంలోని డ్వాక్రా సూపర్ మార్కెట్ అద్దెను పెంచి టెండర్ ద్వారా లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎడపల్లి గ్రామంలోని ప్రభుత్వ గోదాం భవనం గత సుమారు 20 సంవత్సరాలుగా డ్వాక్రా సూపర్ మార్కెట్ వారి అద్దెకు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఆ భవనానికి మార్కెట్ విలువ ప్రకారం నెలకు సుమారు 20 వేలు లేదా అంతకంటే ఎక్కువ అద్దె వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 4 వేల 500 రూపాయలు మాత్రమే అద్దె వసూలు చేయబడుతోందని, దీనివల్ల ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయ నష్టం కలుగుతోందన్నారు. ఈ విషయమై గతంలో కూడా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇంత తక్కువ అద్దెకు కొనసాగించడం వల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయో గ్రామ ప్రజలకు అర్థం కావడం లేదని, ప్రభుత్వ ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించబడాలి మరియు వాటి ద్వారా ప్రభుత్వానికి తగిన ఆదాయం సమకూరాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు అడుగులు వేయకపోవడం సిగ్గుచేటన్నారు. అందువలన, ఈ గోదాం భవనాన్ని ప్రభుత్వం అవసరాలకు వినియోగించే విధంగా పరిశీలించాలని లేకుంటే సూపర్ మార్కెట్ అద్దెను మార్కెట్ విలువకు అనుగుణంగా బహిరంగ టెండర్ లేదా వేలం నిర్వహించి, అత్యధిక అద్దె చెల్లించగల వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

# హమాలీల సమస్యలు పరిష్కరించాలి

**కరీంనగర్, ఆగస్టు 24, ( జనం సాక్షి)**హమాలి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆల్ హమాలి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, గీట్ల ముకుందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో రైస్ మిల్లులు, సీడ్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్లు, ఐకేపీ, బేవరేజెస్, కిరాణా, కొబ్బరికాయలు, స్టీల్, సిమెంట్ తదితర రంగాల్లో పనిచేస్తున్న హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు హమాలి కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి అసంఘటిత కార్మికులుగా నమోదు చేయాలని, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి హెల్త్ కార్డు అందించి ఉచిత వైద్య సేవలు కల్పించాలని, 55 ఏళ్లు పైబడిన




హమాలీలకు నెలకు కనీసం రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని హమాలి కార్మికులకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలం కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పని ప్రదేశాల్లో మంచినీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన హమాలి కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ప్రమాద బీమా అందించాలని, అందరికీ ప్రమాద బీమా, సహజ మరణ పరిహారం, ఆరోగ్య బీమా ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఐఎల్ఓ తీర్మానం ప్రకారం 50 కిలోలకుపైగా బరువున్న బస్తాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికుల కోసం ప్రత్యేకంగా హమాలి నగర్ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నాయకులు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు పిల్లి రవి యాదవ్, ఆవుల రాజయ్య, చౌదరి సంపత్, మర్రి పోచయ్య, తిరుపతి, చుక్క కుమార్, చుక్క శ్రీనివాస్, రాజమౌళి, పరశురాములు, కనుకయ్య, రవి, కొమురయ్య, నరసయ్య, గట్టయ్య, ప్రభాకర్ రెడ్డి తదితరులతో పాటు సుమారు 200 మంది హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య బీడీ కార్మికుల పింఛన్ దరఖాస్తులు స్వీకరించాలి




**గంభీరావుపేట, ఆగస్టు 24, జనం సాక్షి:**వృద్ధాప్య బీడీ కార్మికుల పింఛన్ దరఖాస్తులను వెంటనే స్వీకరించి, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు సోమవారం గంభీరావుపేట మండల ప్రజావాణిలో ఎంపీడీవో రాజేందర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం పింఛన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ, వృద్ధాప్య బీడీ కార్మికుల దరఖాస్తులను తీసుకోవడం లేదని ఆరోపించారు. బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవించిన వృద్ధ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన వృద్ధ బీడీ కార్మికుల దరఖాస్తులను వెంటనే స్వీకరించి, వారికి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ఇరిగి సందీప్, చిట్టెంపల్లి బిక్షపతి, ఏగదండి అర్జున్, ఏగదండి రవి, ఎండి అస్మాత్, బండరాజు, దోశల శంకర్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు లేక ఫీల్డ్ అసిస్టెంట్ల అవస్థలు




**ముత్తారంఆగస్టు 24(జనంసాక్షి):** మండలంలోని 15గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం (వీబీజీ రామ్‌జీ)లో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా గ్రామాల్లో పథకం పనుల నిర్వహణ, కూలీల హాజరు తదితర బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పటికీ సకాలంలో జీతాలు అందడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యను సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేసి తమకు ఆర్థిక భరోసా కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# ప్రజావాణిలో 11 దరఖాస్తులు స్వీకరణ




**గంభీరావుపేట, ఆగస్టు 24 జనం సాక్షి;**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 5, హౌసింగ్‌కు 2, పోలీస్ శాఖకు 1, ఉపాధి హామీ పథకానికి 1, విద్యాశాఖకు 1, పంచాయతీరాజ్ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు ఏవైనా ఉంటే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల చేయాలని డిమాండ్



**కరీంనగర్ బ్యూరో ఆగస్టు 24 (జనంసాక్షి)** :రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆగస్టు 24, 25 తేదీల్లో చేపడుతున్న రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, నిరసన దీక్ష చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు అర్థాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని మండిపడ్డారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల చెల్లింపు కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో సర్టిఫికెట్లు అందక, పరీక్షలకు హాజరుకాక విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం తక్షణమే స్పందించి పేరుకుపోయిన బకాయిలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి బకాయిలను విడుదల చేయకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, అడిచెర్ల రాజు, అవదుర్తి శ్రీనివాస్, కార్పొరేటర్ కొమురయ్య, నాయకులు పెద్దపల్లి జితేందర్, గుంజేటి శివ, సుధాకర్ పటేల్, వెంకటేష్, మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ లు ఫీజు రియంబర్స్మెంట్ వైఖరి పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని తప్పు పట్టారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా తక్షణమే రూ.12 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, కన్నా కృష్ణ , సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహరాజు, చేపూరీ సత్యం, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, మండల అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, కంది రాజిరెడ్డి, చింతం శ్రీనివాస్, తనకు సాయికృష్ణ, పాదం శివరాజ్, కార్పొరేటర్ లు బండ రమణ రెడ్డి, దేశీ శిల్పా పెద్దపల్లి శ్రీలేఖ, తాటి ప్రభావతి, మాసం గణేష్, భూపతి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య తీరేది ఎప్పుడో



**రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో 12వ వార్డు** అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గత కొన్ని సంవత్సరాల నుండి డ్రైనేజీ మరియు సిసి రోడ్డు లేక 12వ వార్డ్ స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలం వస్తే చాలు మట్టి రోడ్డు బురదగా మారిపోతుంది. స్కూలుకు వెళ్లే పిల్లలకు బురదలో నడవాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12వ వార్డులో గెలుపొందిన వార్డు సభ్యురాలు ఉరుమడ్ల దీపిక ఎన్నిసార్లు గ్రామపంచాయతీలో మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.గ్రామపంచాయతీ బాడీ మీటింగ్ లో 12వ వార్డు సమస్యను గ్రామ సర్పంచ్ కి ఉప సర్పంచ్ కి సెక్రటరీ కి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేవారు లేరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువలు లేక మురికినీరు వీధుల్లో ప్రవహిస్తూ ఉంటుంది. వర్షం పడితే ఆ దారిన వెళ్లాలంటేనే నరకంగా ఉంది. డ్రైనేజీ కాలువ లేక సీజన్‌తో సంబంధం లేకుండా మురికినీరు రోడ్డుపై నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. డ్రైనేజీ కాలువల్లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం డ్రైనేజీ కాలువల కోసం రూ. 15 లక్షలు గ్రామపంచాయతీకి డబ్బులు మంజూరు అయినా కూడా డ్రైనేజ్ సమస్య తీరడం లేదు.ఎంత మంది పాలకులు మారినా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ కార్యదర్శి అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నాయి.

# 27న జిల్లా కేంద్రం లో జరిగే ధర్నా ని విజయవంతం చేయాలి



**గన్నేరువరం, ఆగస్టు 24 (జనంసాక్షి)**:తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి.జీ.ఈ.జె.ఎ.సి.) ఆధ్వర్యంలో ఈనెల 27న కరీంనగర్ జిల్లా కేంద్రం లలో జరిగే ధర్నాలు ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని డి.టి.ఎఫ్. (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ) కరీంనగర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఈరోజు గన్నేరువరం మండలంలో జరిగిన డి.టి. ఎఫ్. 2026-27 విద్యా సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని పిఆర్సి ను అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డి.ఏ. లను చెల్లించాలని, 2003 డి.యస్.సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలని మరియు హెల్త్ కార్డ్ లపై ఉన్న అనుమానాలను తొలగించి వెంటనే కార్పొరేట్ ఆసుపత్రి లలో అమలు అయ్యేలా చూడాలని ఎలేనిపక్షంలో ఉపాధ్యాయ ఉద్యోగుల వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర కౌన్సిలర్ కానుగంటి రాజమౌళి మాట్లాడుతూ సీపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనరసింహ రెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శి ఉప్పునూటి రవి, మండల విద్యాధికారి కే.రామయ్య,ఉపాధ్యాయులు శంకర్ రావు, రజనీకాంత్, నరేష్ భాగ్యలక్ష్మి, శోభారాణి, ఇఫ్తెకరలి, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అచ్చ రవీందర్ నియామకం



**చిగురుమామిడి ఆగస్టు 24 (జనంసాక్షి)**:బిజెపి పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన అచ్చ రవీందర్ ను నియమిస్తూ సోమవారం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఉత్తర్వులను జారీ చేశారు.ఈ సందర్భంగా అచ్చ రవీందర్ మాట్లాడుతూ బిజెపి పార్టీ అభివృద్ధికి, క్రమశిక్షణతో పని చేస్తానని తెలిపారు.తన నియమకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు,జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ కు,పార్టీ కార్యకర్తలకు,నాయకులకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.రవీందర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండల పరిధిలో విస్తృతంగా పోలీసుల ప్రత్యేక తనిఖీలు





**మల్యాల ఆగస్టు 24 (జనం సాక్షి)** మండల కేంద్రంలోని అంగడి బజార్,బస్ స్టాండ్ పరిసరాలు,దుకాణాలు,అనుమానాస్పద ప్రదేశాలు ,మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలను మరియు ఇతర ముఖ్య ప్రదేశాలలో సోమవారం బాంబ్ డిటెక్షన్ టీమ్‌తో పాటు గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల గుర్తింపులో నైపుణ్యం కలిగిన డాగ్ స్క్వాడ్ కుక్క తో స్థానిక పోలీసులతో కలిసి మండల పరిధిలో విస్తృతంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రజా భద్రత,శాంతి భద్రత పరిరక్షణతో పాటు యువతలో మత్తు పదార్థాల వ్యసనం మరియు వాటి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడంలో భాగంగా తనిఖీలు చేపట్టిన ఎస్సై సందీప్ తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఇందల్వాయి పాఠశాల విద్యార్థులు ఎంపిక




**ఆగస్టు 24 (జనం సాక్షి)** గత శనివారం ఆర్మూర్ లోని విపిఎస్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నిజాంబాద్ జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ లో జడ్పిహెచ్ఎస్ ఇందల్వాయి పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు1 నాగచైతన్య. 2.ఈశ్వర్.3. గౌతం.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి రాజేశ్వర్ తెలియజేశారు. ఈ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 29 30 తేదీలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి నిజాంబాద్ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి . గోపి. శ్యామల కుమారి. శైలజ. అరుణ. సుజాత. నాగమణి. స్వప్న. సుజాత . ఉపాధ్యాయ బృందం పాల్గొని క్రీడాకారులను అభినందించడం జరిగింది.

# ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రబంధ 2కె26 మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహణ



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో "ప్రబంధ 2కె26" మేనేజ్‌మెంట్ మీట్‌ను ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, శాతవాహన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ - కామర్స్ ప్రిన్సిపాల్ డా. ఎన్. రంగ ప్రసాద్ ముఖ్య అతిథిగా, ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై వివిధ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమ అధ్యక్షులు వి. రవీందర్ రెడ్డి, ముఖ్య అతిథి డా. ఎన్. రంగ ప్రసాద్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం డా. ఎన్. రంగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణను పాటిస్తూ, అకడమిక్స్‌తో పాటు వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను అభివృద్ధి చేసుకో వాలని సూచించారు. అలుమనితో అనుసంధానం ద్వారా వారి అనుభవాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ విద్యతో పాటు వివిధ నైపుణ్య ఆధారిత కార్యక్రమాల్లో పాల్గొని తమ వ్యక్తిగత, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇంకబాషన్ సెల్ ను ఉపయోగించుకొని కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలని, భవిష్యత్తులో జాబ్ సీకెర్స్ గా కాకుండా జాబ్ గివెర్స్ గా ఎదగాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డి మాట్లా డుతూ. కళాశాలలో నిర్వహిస్తున్న బిబిఎ కార్యక్ర మాలను అభినందించారు. విద్యార్థులు ఇంట్రె ఎనేర్షిప్ వైపు కూడా దృష్టి సారించి, కొత్త ఆలోచ నలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాలలోని జాబ్ - ఓరియెంటెడ్ కర్రీసులుం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడం అభినందనీయమని తెలిపారు. మేనేజ్‌మెంట్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఫార్మల్ ఈవెంట్స్ గా జ్ఞాన వ్యూహ (మానేజ్మెంట్ క్విజ్), వివాదా (డిబేట్), షార్క్ ట్యాంక్ (స్టార్ట్ అప్ ఐడియాస్), ప్రచార (యాడ్ మేకింగ్ నిర్వహించారు. ఇన్ఫర్మల్ ఈవెంట్స్ తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో "ప్రబంధ 2కె26" విజయవం తంగా ముగిసిందని తెలిపారు. ఈకార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్- కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ రంగ ప్రసాద్, ఎస్ ఆర్ ఆర్. గౌట్. డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సి. మల్ల రెడ్డి, ఆల్ఫోర్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్, మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏల్లారెడ్డి చరిత్రలోనే అతిపెద్ద జాబ్ మేళా





**కామారెడ్డి జిల్లాప్రతినిధి ఆగస్టు 24 (జనం సాక్షి)**నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలోని మదన్ మోహన్ ట్రస్ట్ నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. యెల్లారెడ్డి నియోజకవర్గ చరిత్రలోనే అతిపెద్ద స్థాయిలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 10 వేల మందికి పైగా యువత హాజరై ఉద్యోగ అవకాశాలను అన్వేషించారు. ఈ జాబ్ మేళాలో 80 ప్రముఖ జాతీయ, బహుళజాతి కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందించాయి. మాన్యుఫ్యాక్చరింగ్, ఫార్మాస్యూట కల్స్, సాఫ్ట్‌వేర్, ఐటీ, నాన్-ఐటీ, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, ఏవియేషన్, మెడికల్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ తదితర రంగాలకు చెందిన సంస్థలు నియామక ప్రక్రియను నిర్వహించాయి. ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అమెజాన్ , శంసుంగ్ , జియో , ఐతీ. రెడ్డి 'ం, టాటా , ఎయిర్టెల్ , నీట్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ , ా×జ తదితర ఆర్థిక, బీమా సంస్థలు కూడా జాబ్ మేళాలో పాల్గొన్నాయి. మెడికల్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, తయారీ, ఐటీ--సాఫ్ట్‌వేర్, వ్యవసాయం, ఏవియేషన్, నాన్-ఐటీ రంగాలకు చెందిన పలు సంస్థలు తమ ఉద్యోగ ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ, ఫార్మసీ, మెడికల్ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు వారి అర్హతలు, నైపుణ్యాలు, అనుభవానికి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అన్వేషించే అవకాశం లభించింది. 1,246 మందికి అక్కడికక్కడే ఉద్యోగ ఆఫర్లు జాబ్ మేళాలో నిర్వహించిన ఇంటర్వ్యూలు, ఎంపిక ప్రక్రియ అనంతరం 1,246 మంది అభ్యర్థులకు స్పాట్ జాబ్ ఆఫర్లు లభించాయి. ఒకే వేదికపై వేలాది మంది ఉద్యోగార్థులు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి ఉద్యోగ అవకాశాలను పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత నియోజకవర్గంలోనే ఇంతటి స్థాయిలో కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకురావడంపై యువత, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు యువత కృతజ్ఞతలు జాబ్ మేళాలో పాల్గొన్న పలువురు నిరుద్యోగ యువత ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది యువతకు ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగం కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదని, అది యువత కుటుంబాలకు భరోసాను, వారి భవిష్యత్తుకు పునాదిని అందిస్తుందని పలువురు ఉద్యోగార్థులు అభిప్రాయపడ్డారు. యువతకుఉపాధి..నియోజకవర్గ అభివృద్ధికి బాట మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పరిశ్రమలు--యువత మధ్య వారధిగా నిలిచింది. 10 వేల మందికి పైగా యువత, 80 ప్రముఖ కంపెనీలు, 1,246 స్పాట్ జాబ్ ఆఫర్లు ఈ కార్యక్రమం విజయాన్ని ప్రతిబింబించాయి .యెల్లారెడ్డి నియోజకవర్గ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం సాధికారత దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు మదన్ మోహన్ ట్రస్ట్ కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలి



**ఆర్మూర్,ఆగస్టు 24(జనంసాక్షి):**ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల కొరకు గతంలో దరఖాస్తు చేసుకోలేని వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆర్మూర్ తహసిల్దార్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్మూర్ ఎమ్మార్వో కార్యాలయంలో మున్సిపల్,రెవెన్యూ సిబ్బంది ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకొని వారికి ఈ నెల 25 ఆగస్టు 2026 నుండి 31 ఆగస్టు2026 వరకు ఆర్మూర్ తహసిల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తులు సమర్పించాలన్నారు. రెండు గదులు,హాలు,కిచెన్ తో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తుదారుడు దరఖాస్తు ఫారం,కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయవలసిందిగా కోరారు. ఇట్టి సదవకాశాన్ని ఆర్మూర్ మున్సిపాలిటీ ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

## దక్షిణకాశీ స్వామి ఆలయ అర్చకుడిగా నవీన్ శర్మ నియామకం



**భిక్కనూరు ఆగస్టు 24 జనం సాక్షి:**-భిక్కనూరు మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీసిద్ధరామేశ్వర స్వామి దేవాలయ అర్చకులుగా కొడకండ్ల నవీన్ కుమార్ శర్మకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు నియామక పత్రాన్ని నవీన్ కుమార్ శర్మకు అందజేశారు,ఆలయంలో ఆలయ అనువంశిక అర్చకులుగా కొనసాగి పదవి విరమణ పొందిన కొడకండ్ల సిద్ధగిరి శర్మ (సిద్ధరామశర్మ) కుమారునికి ఆలయ అర్చక బాధ్యతలు చేపట్టడంతో భక్తులు గ్రామస్తులు ఆనందం వ్యక్తపరుస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కరీంనగర్‌లో కోతుల బెడదకు చెక్

**కరీంనగర్, క్రైమ్ ఆగస్టు 24 (జనంసాక్షి ):**కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సుదీర్ఘకాలంగా ప్రజలను వేధిస్తున్న కోతుల బెడద సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని 13వ డివిజన్ మార్కండేయనగర్ తో పాటు దానికి సమీపంలో ఉన్న పలు కాలనీల్లో ముమ్మరంగా ఆపరేషన్ నిర్వహించి కోతులను పట్టుకున్నారు. నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో, నగరపాలక సంస్థ అనుమతించిన ప్రత్యేక ఏజెన్సీ ప్రతినిధులతో ఈ ప్రక్రియను చేపట్టారు. మార్కండేయనగర్ పరిసర ప్రాంతాల్లో దాదాపు 80 కోతులను సురక్షితంగా బోన్లలో బంధించి...అనంతరం వాటికి ఎలాంటి హాని కలగకుండా వాహనాల్లో సురక్షితంగా అటవీ ప్రాంతానికి తరలించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ. నగర వ్యాప్తంగా తీవ్రంగా ఉన్న కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కార్పొరేషన్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోందని తెలిపారు. నగర మేయర్, కార్పోరేషన్ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పట్టుకొని వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. నగర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు కోతుల బెడదను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు.

## ఎడపల్లి ఎరువుల కుంభకోణంపైఆడిట్ అధికారిగా అబ్దుల్ బారి నియామకం



**ఎడపల్లి, ఆగస్టు 24 ( జనంసాక్షి ) :** ఎడపల్లి సహకార సంఘంలో జరిగిన ఎరువుల కుంభకోణంపై ప్రత్యేక విచారణ అధికారిగా అబ్దుల్ బారిని నియమించడం జరిగిందని, అయితే ఆడిట్ అధికారులు విచారణ చేపట్టిన తర్వాత వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తప్పవని క్లస్టర్ అధికారిని రామవత్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం ఆమె సహకార సంఘం డైరెక్టర్లు చైర్మన్ తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అయితే సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు ఈ విషయంలో ఎరువుల విక్రయాలలో ఎవరి పాత్ర ఉందో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం క్లస్టర్ అధికారిని రమావతి గౌడ్ మాట్లాడుతూ, జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు ఎడపల్లిలో జరిగిన ఎరువుల విక్రయ నిధుల దుర్వినియోగంపై ఆడిట్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. సదరు అధికారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రమావతి గౌడ్ వివరించారు.

## సిరికొండ ప్రజావాణిలో 14 దరఖాస్తులు




**సిరికొండ, ఆగస్టు 24 (జనం సాక్షి):** సిరికొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 14 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ మహమ్మద్ రఫీ తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 7, విద్యుత్ శాఖకు 1, హౌసింగ్కు 3, విద్యాశాఖకు 1, అటవీ శాఖకు 2 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసి, ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ మహమ్మద్ రఫీ కోరారు.

## బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి ఎలక్ట్రీషన్ మృతి



**భిక్కనూరు ఆగస్టు 24 జనం సాక్షి:-** భిక్కనూరు మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తు జీవనం సాగిస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన ఊరే ప్రభాకర్(49) ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది ,గ్రామం లో వీధి దీపాలు వేసేందుకు ఇంటి నుండి సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో వెళ్లి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బొబ్బిలి చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయినట్లు విశ్వాసనీయ సమాచారంగా తెలుస్తుంది,ఈ ఘటనలో ఆయన మృతిచెందగా వారికి భార్య ఊరే కవిత,కు మారుడు దయాకర్,కుమార్తెలు ఉన్నారు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని తెలిపారు.

## ముందస్తు అరెస్టులపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆగ్రహం

**చిగురుమామిడి ఆగస్టు 24 (జనంసాక్షి):** రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనను పురస్కరించుకుని చిగురుమామిడి మండలంలో బీఆర్ఎస్ నాయకులను,కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంపై బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తోందని మండిపడ్డారు. మంత్రి పర్యటన వస్తే ప్రతిపక్ష నాయకులను గృహనిర్బంధాలు చేయడం, పోలీస్ స్టేషన్లకు తరలించడం వంటి అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడ నిలదీస్తారోననే భయంతోనే ఇష్టారాజ్యంగా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. అరెస్టులతో ప్రజా గొంతుకలను, పార్టీ శ్రేణుల ఉద్యమాలను నొక్కలేరని మామిడి అంజయ్య



హెచ్చరించారు. తక్షణమే అరెస్ట్ చేసిన నాయకులను, మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి చింతపుల తిరుపతి గుంటి క్రాంతి కుమార్,కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అడిగిన రైతులను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్,గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరెంటు ప్రమాదంలో ఇంటి యజమానిపై కేసు నమోదు రిమాండ్

**వీణవంక ఆగస్ట్ 24 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన మర్రి సంతోష్ మే నెలలో తన పెళ్లి ఉన్నందున,ఇంటికి పెయింటింగ్ వేయించడానికి ఇదే మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన కల్వల రాజ్‌కుమార్,ఎల్బాక గ్రామానికి చెందిన ఉట్ల దేవయ్య,చల్లూరు కు చెందిన కొయ్యడ శంకర్ లను తేదీ 10-05-2026 ఆదివారం రోజున ఇంటి పెయింటింగ్ పనికి పిలిపించి ఇంటి బయట పెయింటింగ్ వేయాలి అని చెప్పగా,వారు ఇంటి మీది నుండి తగిలేలా కరెంట్ విద్యుత్ వైర్లు ఉన్నాయి అనగా,తగిలితే కరెంట్ షాక్ కొట్టి చనిపోతారు. కాబట్టి ఎల్ సి లైన్ క్లియరెన్స్ తీసుకోమని'ఇంటి యజమానికి




చెప్పారు. మర్రి సంతోష్ వాళ్లతో ఎల్సి తీసుకోకుండానే తీసుకున్నాను'అని అబద్ధం చెప్పి, వాళ్లను నమ్మించి,పెయింటింగ్ వేయమని బయటకు వెళ్లాడు, కొద్దిసేపటికి,మర్రి సంతోష్ ఎల్ సి తీసుకున్నాడని నమ్మి,కల్వల రాజ్ కుమార్ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ఇంటి మీది నుండి వెళ్లే విద్యుత్ తీగలు తగిలి,కరెంట్ షాక్ కొట్టి పడిపోగా,అక్కడున్న వాళ్లు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడినుండి మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యుత్ ప్రమాదంలోఅతనికి రెండు కాళ్లు,ఒక చెయ్యి పూర్తిగా కాలినందున వాటిని తొలగించారు. ఇట్టి సంఘటన పై బాధితుడి భార్య తిరుమల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగింది,అలాగే కరెంట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు కూడాఎల్సి తీసుకోలేదని'రిపోర్ట్ పోలీస్ వాళ్లకు పంపించగా సోమవారం రోజున మర్రి సంతోష్ ని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## పేద విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఆగస్టు 24, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథనిలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 19 మండలాల్లోని 40 వేల మంది విద్యార్థులకు ఉదయం పూట బలవర్ధకమైన అల్పాహారం అందించడం జరుగుతుందని ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్ల జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద రాష్ట్ర ప్రభుత్వ, హరే కృష్ణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కిచెన్ సెంటర్ ను మంత్రి శ్రీధర్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ప్రభుత్వం హరే కృష్ణ ట్రస్ట్ సంయుక్తంగా బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ బాగా చదువుకుని తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలని కోరారు. మొదట కొడంగల్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు మంథని ప్రారంభం కాగా, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం, వారి సంక్షేమం పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలలో చేరి బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీ సత్య గౌర చంద్ర






దాస స్వామీజీ ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని గంగపురి వద్ద 2 కోట్ల 55 లక్షలతో నిర్మించిన 33/11 కె.వి సబ్ స్టేషన్ ను రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్-డే..

## బాధితులకు భరోసా కల్పించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజల సమస్యలను త్వరితగతిన,పారదర్శకంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్-డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్వయంగా హాజరై,వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ ప్రతి ఫిర్యాదును పరిశీలించి, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిగణనలోకి తీసుకుని, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా



విచారణ జరిపి,బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీపీ తెలిపారు.ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని,ఎటువంటి ఆలస్యం లేకుండా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వ్యాయామశాల స్థలాన్ని శాశ్వత స్థలంగా మార్చాలి..

- ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతీపత్రం..
- వ్యాయామశాల నిర్వాహకులు ఆమంచ గౌతమ్..

**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం కార్పొరేషన్ కార్యాలయం సమీపాన ఉన్న టి-జంక్షన్ వద్ద ఉన్న వ్యాయామశాల స్థలాన్ని శాశ్వతంగా కేటాయించాలని వ్యాయామశాల నిర్వాహకులు ఆమంచ గౌతమ్ తెలిపారు.ఈ సందర్భంగా గౌతమ్ రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతీపత్రాన్ని అందించారు.వినతీపత్రంలో పలు వివరాలను పొందుపరిచారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించానని,చంద్రబాబు కాన్వయ్‌పై దాడిచేసినందుకు జైలు జీవితాన్ని అనుభవించానని వినతీపత్రంలో తెలిపారు.స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని సౌకర్యాలతో వ్యాయామశాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.2011 సంవత్సరంలో ఈ ప్రాంతంలో తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు అన్ని వర్గాల సహాయ సహకారాలో తెలంగాణ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు.గత యేడాది స్థానిక మున్సిపల్ అధికారులు స్థల కేటాయింపుపై వివరణ కోరారన్నారు. సింగరేణి, మున్సిపల్ అధికారుల సహాయ సహకారాలతోనే వ్యాయామశాలను ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించానని తెలిపారు. గతంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వ్యాయామశాలకు రూ.1,07,000 ఆర్థిక సహాయాన్ని కూడా అందించారని ఆమంచ గౌతమ్ తెలిపారు.మా విన్నపాన్ని మన్నించి తక్షణమే స్పందించి తగిన విధంగా సహాయ సహకారాలు అందించాలని వడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఇచ్చిన వినతీపత్రంలో గౌతమ్ కోరారు.అదే విధంగా వ్యాయామశాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

# భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

- అక్రమ వసూళ్లపై హెచ్చరిక
- ఈవో,డీఈవోల తనిఖీలు

**వేములవాడ, ఆగస్టు 24 (జనంసాక్షి):**
రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి వారి సన్నిధికి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో రమాదేవి, డీఈవో నవీన్ కుమార్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యవేక్షించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణమంతా కలియదిరిగిన అధికారులు ప్రధానంగా క్యూలైన్లు, డొనేషన్ కౌంటర్లను తనిఖీ చేశారు. క్యూలలో వేచి ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ కోడె





మొక్కుల ప్రాంగణంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోడె కట్టే భక్తులు వెళ్లే ఎగ్జిట్ గేటు గుండా ఇతరులను ఎవరినీ లోపలికి అనుమతించవద్దని విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి స్పష్టం చేశారు. ఆలయ ప్రాంగణంలో లేదా కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో భక్తుల వద్ద డబ్బులు డిమాండ్ చేసినా, అక్రమ వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పి ఆర్ ఓ పెరిక శ్రీనివాస్, ఆలయ ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పీస్ కమిటీ సమావేశం నిర్వహించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
మీలాద్-ఉన్-నబీ (ఈద్-ఎ-మిలాద్) పండుగను పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధ్యక్షతన కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పండుగను శాంతియుతంగా,సోదరభావంతో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు,మత పెద్దలతో సీపీ చర్చించారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. జూలూసుల ు,ర్యాలీలు నిర్వహించే సందర్భంలో ముందస్తు అనుమతులు తీసుకుని, నిర్ణయించిన మార్గాల్లో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ర్యాలీలు,జూలూసుల సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను నియమించుకోవాలని తెలిపారు.అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు,ఇతర పరికరాలను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించకూడదని సూచించారు.చిన్నారులు,వృద్ధులు,విద్యార్థులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ప్రసంగాలు, పాటలు,నినాదాలకు దూరంగా ఉండాలని, ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని కోరారు.యువత ముఖ్యంగా శాంతి,క్రమశిక్షణతో వ్యవహరించి ఎలాంటి గొడవలు,వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.పండుగ కార్యక్రమాల సమయంలో మహిళలు,చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ర్యాలీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మతపరమైన కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.పండుగ సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు.కొంతమంది సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు,పుకార్లు సృష్టించే అవకాశం ఉందని,ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అటువంటి పోస్టులను చూసి సంయమనం పాటించాలని కోరారు.ఏదైనా సమాచారం నిజమా,కాదా అనే విషయాన్ని స్థానిక పోలీసులను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్ 112, కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి,మత ఘర్షణలు జరిగేలా లేదా శాంతిభద్రతల సమస్యలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని మతాలకు సంబంధించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, నిరంతరం నిఘా



ఉంచాలని,ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకునేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. శాంతి,సౌభ్రాతృత్వం,పరస్పర గౌరవంతో మీలాద్-ఉన్-నబీ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, రామగుండం సీఐ కృష్ణకుమార్, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఆర్ఐ రమేష్, పెద్దపల్లి ఎస్ఐ నరేష్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్, చెన్నూర్ టౌన్ ఎస్ఐ శ్యామ్‌పటేల్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం, సుల్తానాబాద్ లలో టీజీ ఈ జె ఎ సి ఉద్యమ సన్నాహక సమావేశం

**- 27 మహాధర్నాకు ఉద్యోగులు భారీగా తరలిరావాలి - జే ఏ సీ చైర్మన్ బొంకూరి శంకర్**




సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) : తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రామగుండంలో, సుల్తానాబాద్ లో సోమవారం నిర్వహించిన ఉద్యమ సన్నాహక సమావేశం జరిగింది. ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లు,కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రానున్న ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టి జిఈ జె ఎసి పెద్దపల్లి జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్,జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ, 206 ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి రావడం ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమన్నారు. పి ఆర్ సి,అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డి ఎ,ల విడుదల, సిపిఎస్,రద్దు చేసి ఓ పి ఎస్,పునరుద్ధరణ, హెల్త్ కార్డుల సమర్థ అమలు,పెండింగ్ బిల్లుల చెల్లింపు,జీవో25 సవరణ, జీవో190అమలు వంటి డిమాండ్లు ఉద్యోగుల హక్కులనీ తెలిపారు. ఈ హకు క్కలను సాధించేది సంఘటిత ఉద్యమమే" నని పేర్కొన్నారు. ఆగస్టు 27న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాధర్నాకు రామగుండం డివిజన్, సుల్తానాబాద్ డివిజన్ నుంచి అధిక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని ఉద్యమ విజయానికి దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు. "పెద్దపల్లి జిల్లా నేల ఎప్పుడూ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. ఈసారి కూడా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలనీ అన్నారు. టీఎన్జీవోస్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ, "ఇది కొంతమంది నాయకుల ఉద్యమం కాదు; ప్రతి ఉద్యోగి భవిష్యత్తుకు సంబంధించిన ఉద్యమం. ప్రతి కార్యాలయం,ప్రతి శాఖ, ప్రతి మండలం నుంచి ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. సమావేశానికి రాని సహోద్యోగిని కూడా మహాధర్నాకు తీసుకురావడం మనందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. పెండింగ్ డి ఎలు, సిపిఎస్ఉద్యోగుల భవిష్యత్తు, హెల్త్ కార్డుల అమలు,ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వంటి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. "ఉద్యోగుల ఐక్యతే విజయపథం. ఆగస్టు 27 మహాధర్నా పెద్దపల్లి జిల్లాలో చరిత్ర సృష్టించే కార్యక్రమం కావాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం, సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాలను కూడా విజయవంతం చేయాలని నాయకులు కోరారు. రానున్న రోజుల్లో రామగుండం, సుల్తానాబాద్, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన వరకు ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర నాయకులు సందీప్ రావు, టీఎన్జీఓ అసోసియేట్ అధ్యక్షులు గోపు అనిత, కోశాధికారి కొమురయ్య,జిల్లా సంఘ బాధ్యులు ఎదుల్ల ప్రవీణ్, సౌమ్య, అంజి,చొప్పరి శ్రీనివాస్, శివ ,రాజా రత్నం, అంకమల్ల అనిల్,రామగుండం యూనిట్ అధ్యక్షులు జగన్, కార్యదర్శి సరిత, సుల్తానాబాద్ యూనిట్ అధ్యక్షురాలు నాయిని భాగ్యమ్మ,కార్యదర్శి రాజీ రెడ్డి,పెద్దపల్లి జిల్లా ఎమ్ పి డి ఓ ల అధ్యక్షులు నీలగిరి దివ్యదర్శన్‌రావు, ఇంజనీర్ల సంఘం కార్యదర్శి రవీంద్ర చారి, నరేష్, శ్రీకాంత్, లావణ్య,ఝాన్సీరాణి, టీ జీ ఓ సంఘం నాయకులు వెంకటలక్ష్మి, టీఎన్జీఓ నాయకులు శ్రీవాణి, చంద్రశేఖర్, రీటా కుమారి,మధులిక, శ్రీకాంత్, అంజి, శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి,వికాస్, ప్రకాష్, తిరుపతి, రమేష్, కరీం, అంజద్ పాషా, దామోదర్, సతీష్, స్రవంతి, స్వర్ణ రాణి, లీల, సంతోష్, రవితేజ, రాజప్రసాద్, లక్ష్మణ్,రాజేశం,వినయ్,రాంచంద్రం,రవీంద్ర ,లావణ్య, శైలజ,రవి,రామ్ రెడ్డి,భాస్కర్ రెడ్డి, కుమారి,బి ఉమా, వనిత శ్రీహరి పాల్గొన్నారు.

# మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్

***ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ఆకస్మిక తనిఖీ***

***చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన***



**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24, (జనంసాక్షి) :** అన్ని ఎంపిడివో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండలస్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపిడివో కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వివిధ శాఖల మండలస్థాయి అధికారులు హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ? తదితర ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్‌ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించారు. చేయూత పెన్షన్ కోసం కావాలిసిన వివిధ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరియా అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపిడివో కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజావాణిలో ఎంపిడివో సత్తయ్య, డిప్యూటి తహశీల్దార్ వేణు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రామగుండంలో ఎన్ఐఏ సోదాలు

**- ఇంజనీరింగ్ విద్యార్థి ఇంట్లో తనిఖీలు..**

**- సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో భాగంగా ల్యాప్‌టాప్,సెల్‌ఫోన్ స్వాధీనం..**

**- విద్యార్థిని విచారించిన ఎన్ఐఏ అధికారులు..**

గోదావరిఖని, జనంసాక్షి :

పెద్దపల్లి జిల్లా రామగుండంలో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ),సైబర్ క్రైమ్ విభాగం,స్థానిక పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించినట్టు సమాచారం. దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కేసులో భాగంగా ఒకేసారి ఆరు ప్రాంతాల్లో ఎన్ఐఏ బృందాలు తనిఖీలు చేపట్టినట్టు అధికారులు వెల్లడించినట్టు తెలుస్తోంది. గుజరాత్, బీహార్, మహారాష్ట్ర, న్యూఢిల్లీతో పాటు తెలంగాణలోని రామగుండంలో కూడా ఎన్ఐఏ బృందాలు సోదాలు నిర్వహించినట్టు సమాచారం. ఇందులో భాగంగా రామగుండంలోని అయోధ్యనగర్‌కు చెందిన డెంటల్ డాక్టర్ ఆయుబ్‌ఖాన్ కుమారుడు, ఇంజనీరింగ్ విద్యార్థి ముజమిల్‌ఖాన్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున అధికారులు తనిఖీలు నిర్వహించారు.

**ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం:**

అధికారులు ముజమిల్‌ఖాన్ ఇంట్లో సోదాలు నిర్వహించి,అతనికి సంబంధించిన ల్యాప్‌టాప్‌తో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అనంతరం ముజమిల్‌ను సైబర్ క్రైమ్ కేసుకు సంబంధించిన అంశాలపై విచారించినట్టు తెలుస్తోంది.

**సోషల్ మీడియా గ్రూపులో ఎలా చేరాడు?**

తనకు ఏఐ కోర్సు నేర్పిస్తామని చెప్పి గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాకు సంబంధించిన ఓ గ్రూపులో తనను చేర్చారని ముజమిల్‌ఖాన్ తెలిపినట్టు సమాచారం. ఆ గ్రూపులో ఉన్న కొంతమంది నిర్వాహకులను దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై అధికారులు అరెస్ట్ చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే గ్రూపులో తన ప్రమేయం, పరిచయాలు,ఆన్‌లైన్ కార్య కలాపాలపై అధికారులు ఆరా తీసినట్టు సమాచారం.

**దర్యాప్తు కొనసాగుతున్నట్టు సమాచారం..**

సైబర్ క్రైమ్ కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామగుండంలో జరిగిన సోదాలకు సంబంధించి అధికారులు స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోని సమాచారాన్ని పరిశీలించే అవకాశం ఉంది. అయితే ముజమిల్ ఖాన్‌పై ఎలాంటి నేరారోపణలు నిర్ధారించబడినట్టు ప్రస్తుతానికి అధికారికంగా వెల్లడికాలేదు. సోదాలు, విచారణ దర్యాప్తులో భాగంగానే జరిగినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఎన్ఐఏ లేదా సంబంధిత దర్యాప్తు సంస్థల నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# మెప్మా ఉద్యోగులకు తక్షణమే పే-స్కేల్ జీఓ అమలు చేయాలి..

**- సెర్ప్ ఉద్యోగులతో సమానంగా గుర్తింపు కల్పించాలి..**

**- ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్..**

గోదావరిఖని, జనంసాక్షి :

రాష్ట్రంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కష్టపడి పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, గతంలో మంజూరైన పే-స్కేల్ జీవోను తక్షణమే ఆచరణలోకి తీసుకురావాలని 'ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ' పెద్దపల్లి జిల్లా తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖలు పంపడం జరిగిందని ఆ సంస్థ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులతో సమానంగా, మెప్మా సిబ్బందికి కూడా పట్టణ ప్రాంతాలలో ఫీల్డ్ డ్యూటీలు, స్వయం సహాయక సంఘాల సమన్వయం,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ వారికి తగిన వేతనాలు,ఉద్యోగ భద్రత లేకపోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పే-స్కేల్ జీవో అమలు చేయాలని, గత ప్రభుత్వ హయాంలో మెప్మా ఉద్యోగుల కొరకు మంజూరు చేయబడి, ప్రస్తుతం కీలక అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న పే-స్కేల్ ఫైల్‌పై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులతో సమానంగా మెప్మా సిబ్బందికి కూడా వేతనాలు, సముచిత గుర్తింపు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు,జీవన వ్యయానికి అనుగుణంగా ప్రస్తుత వేతనాలు ఏమాత్రం సరిపోక పోవడంతో ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కనుక ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతన సవరణ చేపటాలని, ఈ అంశంపై ముఖ్యమంత్రి, గవెర్నర్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిడిఎంఎ,మెప్మా డైరెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, మెప్మా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించి వారి కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన వారికి వ్రాసిన లేఖలో కోరారు.

# సర్ ఫేజ్-2పై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సమీక్ష..

**గోదావరిఖని, జనంసాక్షి :**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ ఠాకూర్ సోమవారం సర్-2ఫేజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్-2ఫేజ్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు పాల్గొని సర్-2కు సంబంధించిన ప్రక్రియ, పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగరపాలక మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పోరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఇంచార్జులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ వివాహానికి అండగా స్వప్న-లింగయ్య..

గోదావరిఖని, జనంసాక్షి :

రామగుండం ప్రాంతంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కల్లెడ దివ్య వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులను ఆశ్రయించడంతో స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు,వారికి తెలిసిన దాతల సహకారంతో ఈ నెల 26న దివ్య వివాహాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మారేడుపాకకు చెందిన కందుల స్వప్న-లింగయ్య దంపతులు వారి పిల్లలు అభిలాష్, శ్రీహర్ష ఆధ్వర్యంలో దివ్య వివాహనికి పుస్తె మట్టెలు, మంచాలు,పరుపులతో ఇతర సామాగ్రి పెళ్లికూతురు దివ్యకు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య వివాహనికి సహాయం చేయడం సంతోషంగా ఉందని లింగయ్య పేర్కొన్నారు. అనంతరం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు మద్దెల దినేష్, గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన దివ్య వివాహానికి మానవత దృక్పథం ఉన్నవారు,తమకు తోచిన సహాయం చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కంది సుజాత, రవళి, ఎంఏ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# కౌమారదశలోని విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలి: కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి);** కౌమారదశలోని విద్యార్థులకు శారీరక, భావోద్వేగ వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత, కౌమారదశ ఆరోగ్యం తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ అడోలెసెంట్ సేఫ్టీ క్లబ్స్ లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ విద్యా శాఖ,సంక్షేమ శాఖ, షి టీం,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కౌమారదశలోని విద్యార్థుల్లో శారీరక, భావోద్వేగ వికాసం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత,కౌమారదశ ఆరోగ్యం,లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం, లింగ సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత,చట్టపరమైన అవగాహన,సైబర్ భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,మానసిక ఆరోగ్యం,జీవన నైపుణ్యాలు,స్వీయ రక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా కౌమారదశ విద్యార్థులను శక్తివంతం చేయడం జరుగుతుందన్నారు.

పాఠశాల స్థాయిలో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ అడోలెసెంట్ సేఫ్టీ క్లబ్స్ ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసి అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బాలికల సాధికారత క్లబ్‌లను ఇకపై గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ అడోలెసెంట్ సేఫ్టీ క్లబ్స్ గా మార్చాలని,పాఠశాలల్లో ఈ క్లబ్‌లలో బాలురు, బాలికలు ఇద్దరికీ ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. స్థానిక పోలీసుల సమన్వయంతో విద్యార్థులకు భద్రత కల్పించాలని ఆదేశించారు. బాలల భద్రతకు సంబంధించిన సమస్యలు, బాల్య వివాహాలు, వేధింపులు,సైబర్ నేరాలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలిపేలా అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర ఫోన్ నెంబర్లను అన్ని విద్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వివాహాలతో నష్టాలను వివరించాలని సూచించారు. పదో తరగతి తర్వాత విద్యార్థుల డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రత, ఆరోగ్యం,చట్టపరమైన అవగాహన,సైబర్ భద్రత, జీవన నైపుణ్యాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించి,పాఠశాలలను విద్యార్థులకు మరింత సురక్షితమైన వాతావరణంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇట్టి సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా విద్యాధికారి మొండయ్య, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఆయా మండలాల ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ ను సస్యశ్యామలం చేస్తా

ఉన్న సమస్యలను ఆయా గ్రామాల ప్రజలను ప్రజాప్రతిథులను అడిగి తెలుసుకుని అధికారుల ముందే పరిష్కారానికి కృషి చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు తీరిపై మంత్రి సీరియస్ అయ్యారు, వెంటనే సమస్యను పరిష్కరించాలని మరోసారి రిపీట్ కావొద్దు అంటూ విద్యుత్ శాఖ అధికారులను మందలించారు. పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమానికి గ్రామాల్లోని ప్రజల నుండి అనుహస్పందన లభించింది. గ్రామ గ్రామాన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కోలాటం బతుకమ్మలతో వచ్చి ఘన స్వాగతం పలికారు. పలు హామీలు ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో మామకమవుతూ ముందుకు వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్,మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,సర్పంచులు గుళ్ళ రజిత రాజు,చింతపుల నరేందర్ పటేల్,గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, గునుకుల మధుసూదన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,నాయకులు సాంబారి బాబు,చిట్టుమల్ల రవీందర్,పోటు మల్లారెడ్డి, దోమ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కనపర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరాలపై పోలీసుల దాడి






**వీణవంక ఆగస్టు 24 (జనంసాక్షి)**
వీణవంక మండలంలోని కనపర్తి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం అందుకున్న వెంటనే స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న సదరు ప్రదేశానికి వెళ్లి ఆకస్మికంగా పేకాట రాయుళ్లపై దాడి చేయగా,మొత్తం10 మంది ప్రకాష్,సంతోష్,మధు,కుమార్, రఘుపతి రెడ్డి,విజయ్,శ్రీనివాస్, కుమార్,మహేష్ తోపాటు తిరుపతి గౌడ్,2 వ్యక్తులు పట్టుబడగా,మిగిలిన 8 మంది పోలీసులను గమనించి అక్కడి నుండి పరారయ్యారు. సంఘటనా స్థలంలో ఉన్న 7 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడమైనది. అంతే కాకుండా పట్టుబడిన పేకాటరాయుళ్ల వారి వద్ద నుండి రూ. 7,500/-నగదు తోపాటు 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవడమైనది. వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా పేకాట స్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ మోహన్, కొమురయ్య,కానిస్టేబుల్ రవి కోమల్, ఆంజనేయులు,పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు



**24 జగిత్యాల జిల్లా క్రైమ్ జనం సాక్షి**
విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలనీ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ చంద్ర రావు తలపెట్టిన 48 గంటల దీక్ష కార్యక్రమం లో భాగంగా వారికి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర ఓ బి సి మోర్చా ఉపాధ్యక్షుడు మచ్చ నారాయణ సోమవారం రోజున దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రముఖులు, బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

**పెద్దపల్లి,ఆగస్టు 24(జనంసాక్షి) :**
ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీలి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, లిఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద లిఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రామ సభ,వార్డు సభలో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని,జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలాలి అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలని అన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలనిలి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య లికనీసం 7 రోజుల వ్యవధిలిఉండేలా చూడాలని సూచించారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను సక్రమంగా డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా లిఇంకా సుమారు 10 వేల నోటీసులు జనరేట్ చేయాల్సి ఉందనిలి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించినట్లులి కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సభలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, డ్రాఫ్ట్ ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు లిమండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లులి జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై వివరించినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య,ఈ సెక్షన్ సూపర్డెంట్ విజయ్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.





# ఫీజ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలి

◆ పెద్దపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



**పెద్దపల్లి,ఆగస్టు 24(జనంసాక్షి) :**
పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో,బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, తెలంగాణలో విద్యార్థి విద్రోహ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు.
జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనానికి నాంది అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తున్న ఈ ప్రభుత్వం త్వరలోనే కుప్పకూలి పోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, సౌదరి మహేందర్ యాదవ్, కాసగోని నిర్మల, బెజ్జంకి దిలీప్ కుమార్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలుక భారతి, శివంగారి సతీష్, భూతగడ్డ రాజకుమార్, రామగిరి అఖిల్,పెంజర్ల రాకేష్ యాదవ్,వేల్పుల రమేష్, కారెంగుల శ్రీనివాస్ రెండ్ల వేణు,తీగల అశోక్, కొల్లూరి సంతోష్,గుడ్ల సతీష్, రాజేందర్‌రెడ్డి,ఉమేష్,పెంచాలసంతోష్,దాత రాకేష్,తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :**
సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా మండల కేంద్రాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో, ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివ్యదర్శనరావు స్పష్టం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం లో మండలంలోని 27 ప్రభుత్వ కార్యాలయ లకు సంబంధించిన అధికారులు సమావేశానికి హాజరై ప్రజల నుండి వివిధ రూపాలలో వచ్చిన 2 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం తాసిల్దార్ బషీరుద్దీన్,ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, మున్సిపల్ కమిషనర్ టి రమేష్, మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్యలు మాట్లాడుతూ, జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలు సమర్పించేందుకు గాను ప్రజలకు ఇబ్బందులు కలుగుతుండడంతో, నేరుగా ప్రజలకు సులువుగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలాలలో దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేసే విధంగా మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. సుల్తానాబాద్ మున్సిపల్ తో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అందించి సంబంధిత అధికారులతో పరిష్కారం పొందవచ్చునని వివరించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలతో పాటు మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో 27 శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సన్న వడ్ల బోనస్ దరఖాస్తుల స్వీకరణ

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :**
సన్న వడ్ల బోనస్ నమోదు కోసం సోమవారం అల్లిపూర్ రైతువేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) వై.రవితేజ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ప్రభుత్వం క్వింటాకు రూ.500 ప్రోత్సాహకం ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. సీడ్ ప్లాంట్లు, సొంత విత్తనాలు వాడిన కర్షకులు స్వీయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు.నమోదు చేసుకోని వారు బోనస్‌కు అనర్హులని ఏఈవో రవితేజ స్పష్టం చేశారు.రైతుల వివరాలను అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు.లబ్ధి కోసం త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

– రైతువేదికలో ముమ్మరంగా నమోదు ప్రక్రియ : సన్న రకం వరి సాగు చేస్తున్న కర్షకులకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ అందించేందుకు చేపట్టిన ముందస్తు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అల్లిపూర్ రైతువేదికలో ఊపందుకుంది. వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) వై.రవితేజ స్వయంగా హాజరై రైతుల వద్ద నుంచి దరఖాస్తు ఫారాలు, అవసరమైన రికార్డులను స్వీకరించారు. బోనస్ పథకానికి అర్హత సాధించేందుకు గ్రామ పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో రైతువేదికకు చేరుకుని తమ పేర్లను నమోదు చేయించుకున్నారు.

– స్వీయ ధ్రువీకరణ పత్రాల పరిశీలన : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సీడ్ ప్లాంట్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు, విత్తనోత్పత్తి కొరకు సాగు చేస్తున్నవారు, సొంత విత్తనాలు వినియోగించిన రైతులు తప్పనిసరిగా ఏఈవో వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం వివరాలతో పాటు సాగు విస్తీర్ణం, వరి రకాన్ని పేర్కొంటూ పూరించిన స్వీయ ధ్రువీకరణ పత్రాలను ఏఈవో వై.రవితేజకు అందజేశారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్ పోర్టల్‌లో



వివరాలను నమోదు చేశారు.

– అర్హులందరికీ బోనస్ అందేలా చర్యలు : విత్తన డీలర్ల వద్ద నమోదు కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా రైతువేదికను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఈవో వై.రవితేజ సూచించారు. ఈ ముందస్తు సమాచారం ఆధారంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే సమయంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బోనస్ జమ కానుంది. నమోదు చేసుకోని రైతులు బోనస్ పొందే అవకాశాన్ని కోల్పోతారని, సన్న వరి సాగుదారులందరూ వెంటనే దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

## అక్టోబర్ నెలాఖరులోగా ఎంపిక చేసిన 70 గ్రామాల్లో

# భూముల రీ-సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష





- ◆ భూ వివాదాలతో సంబంధం లేకుండా 100 శాతం భూముల రీ-సర్వే నిర్వహించాలి
- ◆ లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి
- ◆ ప్రతి రోజు సర్వే డేటాను ఆన్‌లైన్‌లో సింక్రనైజ్ చేయాలి

**పెద్దపల్లి,ఆగస్టు 24(జనంసాక్షి) :**
ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి దశలో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ--సర్వే ప్రక్రియను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులతో భూముల రీ-సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం రీ-సర్వే పనుల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం ఎకరాకు రూ.60 చొప్పున చెల్లిస్తుందని, రీ--సర్వే పనులు పూర్తయిన 15 రోజుల్లోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.రీ-సర్వే పనులకు ముందుకు రాని లైసెన్స్‌డ్ సర్వేయర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఇప్పటివరకు 13 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు. గురువారం నాటికి ఎంతమంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు రీ-సర్వేకు ముందుకు వచ్చారో వివరాలు సేకరించి,తహసీల్దార్లు ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయిన గ్రామాలకు రూ.5 వేల మొత్తాన్ని అందించేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సర్వే బృందంలో జీపీఓ,లైసెన్స్‌డ్ సర్వేయర్, రెగ్యులర్ సర్వేయర్ ఉండేలా చూడాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులో లేని సందర్భంలో రెవెన్యూ సిబ్బంది, జీపీఓలను వినియోగించుకుని రీ-సర్వే ప్రక్రియను కొనసాగించాలని తెలిపారు.భూ వివాదాలు ఉన్నప్పటికీ రీ-సర్వే ప్రక్రియను నిలిపివేయకుండా 100 శాతం భూములను సర్వే చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వివాదాస్పద భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకూడదని సూచించారు. ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 30 ఎకరాల రీ--సర్వే పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని ఆదేశించారు.ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ--సర్వే పనులను ఒకేసారి ప్రారంభించి సమాంతరంగా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. రీ-సర్వే ప్రక్రియపై గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల సహకారం తీసుకోవాలని తెలిపారు.రీ-సర్వేకు సంబంధించిన అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి రోజు నిర్వహించిన సర్వే డేటాను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సింక్రనైజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పూర్తి చేసిన గ్రామాల వివరాలు,పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఒక గ్రామం రీ-సర్వే పూర్తి చేయని సిబ్బందికి పదోన్నతి కల్పించరాదనే ప్రభుత్వ నిబంధనను అధికారులు దృష్టిలో ఉంచుకుని, నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ ఓదెల తహసిల్దార్ వనజ, ఇన్చార్జి డిపిఓ శ్రీ మాల, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ సంబంధిత రెవెన్యూ,సర్వే శాఖల అధికారులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలోని రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ట్రాఫిక్ సమస్యలు, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ, జామ్‌లు ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నగర ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ వార్షిక తనిఖీలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామితో పాటు సంబంధిత సీఐలు, సంజీవ్ కుమార్, అంజయ్య, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్వాక్రా సూపర్ మార్కెట్ అద్దెను పెంచాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**ఎడపల్లి, ఆగస్టు 24 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండల కేంద్రంలోని డ్వాక్రా సూపర్ మార్కెట్ అద్దెను పెంచి టెండర్ ద్వారా లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎడపల్లి గ్రామంలోని ప్రభుత్వ గోదాం భవనం గత సుమారు 20 సంవత్సరాలుగా డ్వాక్రా సూపర్ మార్కెట్ వారి అద్దెకు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఆ భవనానికి మార్కెట్ విలువ ప్రకారం నెలకు సుమారు 20 వేలు లేదా అంతకంటే ఎక్కువ అద్దె వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 4 వేల 500 రూపాయలు మాత్రమే అద్దె వసూలు చేయబడుతోందని, దీనివల్ల ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయ నష్టం కలుగుతోందన్నారు. ఈ విషయమై గతంలో కూడా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇంత తక్కువ అద్దెకు కొనసాగించడం వల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయో గ్రామ ప్రజలకు అర్థం కావడం లేదని, ప్రభుత్వ ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించబడాలి మరియు వాటి ద్వారా ప్రభుత్వానికి తగిన ఆదాయం సమకూరాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు అడుగులు వేయకపోవడం సిగ్గుచేటన్నారు. అందువలన, ఈ గోదాం భవనాన్ని ప్రభుత్వం అవసరాలకు వినియోగించే విధంగా పరిశీలించాలని లేకుంటే సూపర్ మార్కెట్ అద్దెను మార్కెట్ విలువకు అనుగుణంగా బహిరంగ టెండర్ లేదా వేలం నిర్వహించి, అత్యధిక అద్దె చెల్లించగల వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు.




## విద్యార్థుల భద్రతే లక్ష్యం.. డ్రైవర్లకు యూనిఫామ్‌లు అందజేత

**- రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన**

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :**
విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఇండియన్ పబ్లిక్ పాఠశాల యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా పాఠశాలలో పనిచేస్తున్న డ్రైవర్లకు యూనిఫామ్‌లను అందజేయడంతో పాటు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ కార్యక్రమంలో పాల్గొని డ్రైవర్లకు యూనిఫామ్‌లు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అన్నారు. పాఠశాల బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా డ్రైవర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో రహదారి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా పాఠశాల వాహనాలను నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిర్ణీత వేగ పరిమితిని మించకుండా వాహనాలను నడపాలని,విద్యార్థులు ఎక్కే సమయంలో, దిగే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.వాహనాల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని, వాహనాల పరిస్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని తెలిపారు.రహదారిపై ఇతర వాహనదారులు, పాదచారులు, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించేలా డ్రైవర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పాఠశాల విద్యార్థుల విద్యతో పాటు వారి భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పాఠశాల బస్సుల్లో విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండేలా డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సూచనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.డ్రైవర్లు యూనిఫామ్ ధరించడం వల్ల పాఠశాల వాహన సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవా భావం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మర్యాదగా వ్యవహరిస్తూ పాఠశాల ప్రతిష్ఠకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు.అలాగే వర్షాలు,రద్దీ ప్రాంతాలు,పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను మరింత జాగ్రత్తగా నడపాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల యాజమాన్యం,డ్రైవర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చైర్మన్,ప్రిన్సిపల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత మేనేజర్ శివ,పాఠశాల సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**పెద్దపల్లి,ఆగస్టు 24(జనంసాక్షి) :**
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ.ఫాతిమా తాము 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నామని తమకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేటు గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష తాను ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు కాంట్రాక్ట్ లేదా అవుట్సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారది కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన బర్ల బాపు సర్వేనెంబర్ 119 సర్వే నెంబరు లోగల రెండు ఎకరాల 25 గుంటల వ్యవసాయ భూమికి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా ముత్తారం తహసిల్దార్ కు రాస్తూ విచారణ చేసి రిపోర్ట్ సమర్పించ వలసిందిగా అదనపు కలెక్టర్ సూచించారు.పెద్దపల్లి మండలం బందారి కుంట గ్రామానికి చెందిన నేరెళ్ల లత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నూతన అర్హత మేరకు నూతన పెన్షన్ మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బి.ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని డివైడర్ ధ్వంసం

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :**



మున్సిపల్ పరిధిలోని 15, 4 వార్డు పూసాల రోడ్డులో నూతనంగా నిర్మాణం చేపట్టి ప్రారంభించిన డివైడర్ ను గుర్తుతెలియని వాహనం ఢీకొని ధ్వంసం అయ్యింది.దీంతో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ కమిషనర్, టి రమేష్ సోమవారం పరిశీలించారు.పూసాల రోడ్డును విశాలంగా వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ డివైడర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా డివైడర్ను ప్రారంభించారు. పూసాల రోడ్డులో ఉన్న ఓ ట్రాన్స్పోర్ట్ కు నిత్యం భారీ వాహనాలు వచ్చి మలుపు తిప్పే సమయంలో వాహనం తగిలి డివైడర్ కూలిపోయిందని చైర్మన్ బిరుదు రాధాకృష్ణ తెలిపారు.గ్రామంలో ఉన్న ట్రాన్స్పోర్టు ఊరు చివరన ఉండాలని ఎట్టి పరిస్థితిలో ఊర్లో ఉండకూడదని డివైడర్ ప్రారంభించిన సమయంలో వేసిన శిలాఫలకాన్ని సైతం భారీ వాహనాలు ధ్వంసం చేశాయని ఎట్టి పరిస్థితిలో ఊర్లోకి వాడల్లోకి భారీ వాహనాలు అనుమతించమన్నారు.ట్రాన్స్పోర్ట్ యజమానికి నోటీసులు జారీ చేయాలని కమిషనర్ టి.రమేష్ ను ఆదేశించారు.వీరి వెంట మున్సిపల్ అధికారులతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్లకు నిధులు మంజూరు చేయాలని ప్రజావాణిలో వినతి పత్రం..

**మల్లాపూర్ ఆగస్టు 24(జనంసాక్షి)**
మండలంలోని గొర్రెపల్లికి పుష్కర ఘాట్లకు నిధులు మంజూరు చేయాలని ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం అందజేశారు. మల్లాపూర్ మండలంలోని గోదావరి మొగిలిపేట ఓబులాపూర్ పాత దామరస్పల్లి గ్రామాలలో నుండి గొర్రెపల్లి వేంపల్లి వెంకట్రావుపేటలో మీదుగా ప్రవహిస్తుంది ఈ గ్రామాలలో పుష్కర ఘాట్లను నిర్మించారు అలాగే 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల నిమిత్తం గొర్రెపల్లి గ్రామ గోదావరి పుష్కర ఘాట్లకు నిధులు మంజూరు చేయాలని పాదం భూమేష్, అల్లాల రంజిత్ అందజేశారు.



## శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పుష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

**పెద్దపల్లి,ఆగస్టు 24(జనంసాక్షి) :**
శివునికి అత్యంత ప్రీతికరమైన శ్రావణమాసం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని శ్రీ మల్ల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా స్వామివారికి అత్యంత ఇష్టమైన లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు.స్వామివారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూ లైన్లలో నిలబడి దర్శనం చేసుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధు శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రావణమాసం శివునికి అత్యంత ప్రీతికరమైన మాసమని, రెండవ సోమవారం సందర్భంగా ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని చెప్పారు.



# జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య..

**హుజురాబాద్, ఆగస్టు 24 (జనం సాక్షి ) :** జర్నలిస్టులకు నివేశన స్థలాల విషయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితెల ప్రణవ్ నిలబెట్టుకోవాలని ముదిరాజ్ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య డిమాండ్ చేశారు.జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే కాకుండా, సమస్యను పూరి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కేసు వేసిన స్వామిరెడ్డిని పిలిపించి కేసును ఉపసంహరించుకునేలా చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జర్నలిస్టులు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వార్తలను బహిష్కరించిన తర్వాతే నాయకులు వారి నిరాహార దీక్ష శిబిరం వద్దకు వచ్చారని సమ్మయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యే వరకు అంతర్గతంగా ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న దీక్షకు ఇది తాత్కాలిక విరామమే తప్ప, ఉద్యమ విరమణ కాదని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రజాసంఘాలు



వారికి అండగా నిలుస్తాయని కొలిపాక సమ్మయ్య తెలిపారు.



## ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

**- అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం**

**- జర్నలిస్టుల రిలే నిరాహారదీక్షలను విరమింపజేసిన వొడితల ప్రణవ్**

**హుజురాబాద్, ఆగస్టు 24 ( జనంసాక్షి ) :**
ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామని,అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని వారి ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహారదీక్ష స్థలిని ప్రణవ్ సందర్శించారు.అనంతరం నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాలను మరల న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని,జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ను హసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ఎంపిక

**- అభినందించిన ప్రిన్సిపల్ సీజ్జు ఎస్ నాయర్**

**సుల్తానాబాద్,ఆగస్టు 24 (జనంసాక్షి) :**
సుల్తానాబాద్ లో పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా,అందులో,అండర్ 14 విభాగంలో ట్రైతలాన్ ,సి లో జి.చరిత మొదటి స్థానం ,ట్రైతలాన్-బి లో,అవంతిక తృతీయ స్థానం.అండర్ 16 బాలుర విభాగంలో 60 మీటర్ పరుగులో వి. అశ్వద్ మొదటి స్థానం,600 మీటర్ల పరుగులో టి.సాయి విష్ణు రెండవ స్థానం అండర్-16 బాలికల విభాగంలో,ఎ వైశాలి,లాంగ్ జంప్ లో మొదటి స్థానం,600 మీటర్ల పరుగులో రెండవ స్థానం,60 మీటర్ల పరుగులో రెండవ స్థానం,సాధించారు.వీరు ఈ నెల 26,27వ తేదీన హనుమకొండలో,జరిగే 12 వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నట్లు పెద్దపల్లి అథ్లెటిక్స్ సెక్రటరీ కె గట్టయ్య తెలిపారు. వీరిని కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సీజ్జు ఎస్ నాయర్,వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్ నాయర్ పిటీలు ఎ.అజయ్ డి.రాజు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అభినందించారు.

## పర్మిషన్ ఒకటి.. నిర్మాణం మరొకటి..!

### అక్రమ నిర్మాణంపై ప్రజావాణిలో ఫిర్యాదు

**మెట్పల్లి:ఆగస్టు 24 ( జనంసాక్షి ) :**
పర్మిషన్ కు మించి అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని 12వ వార్డు, వెంకట్రావ్ నగర్ శివారు, తిరుమల అపార్ట్మెంట్ సమీపంలో, జాతీయ రహదారికి ఆనుకుని పోతు మనోహర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. అక్టోబర్ 2023లో జీ+2 అనుమతి తీసుకుని, జీ+3 గా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా జాతీయ రహదారి వైపు 4 మీటర్లు సెట్బ్యాక్ వదలకుండా, బ్రూక్లిన్ స్కూల్ రోడ్డు వైపు 5 ఫీట్లు రోడ్డును ఆక్రమించి నిర్మాణం



చేస్తున్నారని ఆరోపించారు.నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మున్సిపల్ అధికారులు యజమానితో కుమ్మక్కై చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారుడు ఆర్డీవో నరసింహారావుకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో అవినీతి ఆరోపణలపై టీపీఓ రాజేంద్ర ప్రసాద్ ను జిల్లా కలెక్టర్ బీ. సత్యప్రసాద్ సస్పెండ్ చేసినా, అధికారుల తీరులో మార్పు రాలేదని, పట్టణంలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలు కోకొల్లలుగా ఉన్నాయని, కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప కూల్చివేతలు చేయడం లేదని ఆరోపించారు.ఇప్పటికైనా అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి తొలగించాలని కోరారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**మల్లాపూర్, ఆగస్టు24,(జనంసాక్షి)**
మల్లాపూర్ మండలం సాతారం చిట్టాపూర్ గ్రామంలో సోమవారం రోజు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సాతారం లో సర్పంచ్ పోతావేణి నారాయణ గౌడ్,ఉప సర్పంచ్ బాల్సని ప్రణయ్ గౌడ్ ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులను అందచేశారు.ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా,పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటి ఇంటికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో జీపీ ఓ లు , ప్రసాద్,రాజేష్, డీలర్లు కటకం రాజేశం, బొల్లపెల్లి శ్రీనివాస్,వార్డు సభ్యులు, ఉడుగుల శేఖర్ జంగ దేవతి ముత్యం, ఉప సర్పంచ్ భేతి జగన్ రెడ్డి, రామగిరి సంజీవ్,నారాయణ, మణికాంత్, లక్ష్మీ,లత అనూష,గంగమణి,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సోమవారం శ్రీ కనక సోమేశ్వరస్వామి కొండపైన కిరిసిన భక్తులు

### వరదపాశం పోసి మొక్కుల చెల్లింపు..

**మల్లాపూర్,ఆగస్టు 24 (జనంసాక్షి)**
స్వామియే శ్రీ సోమేశ్వర నమో నమః అనే భక్తుల శివ నామస్మరణాలతో మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ కనక సోమేశ్వరస్వామి కొండ మార్మోగింది. ప్రాచీన చరిత్ర గల శ్రీ కనక సోమేశ్వరస్వామి ఆలయం సుమారు పదహారు వందల అడుగుల ఎత్తైన ఏక శిల కొండపై శ్రీ కనకసోమేశ్వరస్వామి ఆలయం కొలువుదీరిన సంగతి తెలిసిందే. ఇక్కడ ప్రతీ ఏటా శ్రావణమాసంలో ఐదు సోమవారాల పాటు భక్తులు కాలినడకన కొండపైకి ఎక్కి కొండపై గల సహజసిద్ధమైన కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి ఎంతో భక్తి శ్రద్ధలతో సోమేశ్వరస్వామికి ప్రీతిపాత్రమైన వరదపాశం (బెల్లం అన్నం)ను వండి ఆలయం ఎదుట వరదపాశం పోసి తమ మొక్కులను చెల్లించి అక్కడే సహపంక్తి భోజనాలు చేయడం అనావాయితీ.రెండవ సోమవారం సందర్భంగా భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు. భక్తులకు కొండ కింద గ్రామానికి



చెందిన శివ శ్రీనివాస్ మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బల్యపల్లి ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను చేశారు. ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, అదిలాబాద్ జిల్లాలతో పాటు, మహారాష్ట్ర ప్రాంతాలను నుండి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు క్యాతం సురేష్ రెడ్డి, మాజీ చైర్మన్ సంగ గంగారాజం, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు, అధికారులు, అఖిలపక్షం పార్టీల నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా.. ట్రాక్టర్ స్వాధీనం..

**గంభీరావుపేట, ఆగస్టు 24 జనం సాక్షి;**
అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ను గంభీరావుపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముస్తఫానగర్ శివారులో ఆదివారం రాత్రి తనిఖీల్లో ఇసుక లోడ్తో వస్తున్న టీ23ఏ7673 ట్రాక్టర్ను పట్టుకున్నారు. డ్రైవర్ నర్మాల గ్రామానికి చెందిన ఒరగంటి ఎల్లయ్య (44)ను అరెస్టు చేసి, ట్రాక్టర్, ట్రైలర్తో పాటు ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.





# పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి: బీజేపీ

## కామారెడ్డి జిల్లా కేంద్రంలో "ఫీజుల బకాయి బీజేపీ లడాయి" పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (జనంసాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని విద్యా సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపడుతున్న 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం, కళాశాలల మధ్య విద్యార్థుల భవిష్యత్తు నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.




# వైభవోపేతంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ఫ్రెషర్స్ డే

## శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని దామోదర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :**

సోమవారం రోజున స్థానిక కరీంనగర్ లోని శుభం గార్డెన్స్ లో శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కనుల పండుగగా జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గోని ఫ్రెషర్స్ డే కార్యక్రమమును విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి, చైర్మెన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్యరెడ్డి, డైరెక్టర్ కర్రా నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దసాని రమేశ్ రెడ్డి మాట్లాడుతూ... 2019 ఎప్రిల్ లో 520 మంది విద్యార్థిని విద్యార్తులతో మొదలు పెట్టి నేటి రోజు 2980 మంది విద్యార్థులతో కరీంనగర్ పట్టణంలో విస్తరించడానికి తొడ్పడిన మా గౌరవ తల్లితండ్రులకు, ప్రియమైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు చదువు విషయంలో కేరియర్ విషయంలో యువత ఎలా ముందుకు సాగాలో ప్రత్యేక సందేశం ఇచ్చి, కాలేజి ఏర్పాటు చేసిన ఇట్టి కార్యక్రమం లో ప్రతి అంశం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపయోగపడుతుం దని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఇంటర్ – 2026 లో రాష్ట్రస్థాయిలో అత్యున్నత మార్కులు సాధించిన శ్రీ చైతన్య ఆణిముత్యాలు (విద్యార్థులను) వారి తల్లిదండ్రులను అభినందించారు. అలాగే సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్యరెడ్డి మాట్లాడుతూ... వ్యక్తి గతంగా విద్యార్థి నిలబడినప్పుడు తన కుటుంబం అభివృద్ధి చెండడంతో పాటుగా దేశాభివృద్ధిలో కూడా పాల్గోనవచ్చని, తెలిపారు. అలాగే గత సంవత్సరము చక్కని ప్రతిభను కనబరచిన విద్యార్థినీ విద్యార్థులను జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు 2026 నందు ఐఐటి, జేఈ మేయిన్స్, మెడిసిన్ లో సీటు సంపాందించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగినది. ఈ విజయ సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన మా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల అధ్యాపక బృందానికి కృతజ్ఞాతానభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, శ్రీచైతన్య కళాశాలల ప్రిన్సిపల్స్, ఎజియమ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.



## గణేష్,దుర్గామాత మండపాలకు

# ఉచిత విద్యుత్ అందించాలి

**విశ్వహిందూ పరిషత్,బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి**

**ఆర్మూర్,ఆగస్ట్ 24(జనంసాక్షి):**

రాష్ట్ర ప్రభుత్వం గణేష్,దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని విశ్వ హిందూ పరిషత్,బజరంగ్ దళ్ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణిలో సోమవారం వినతిలో తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బలే శివాజీ,ఎస్ ఎచ్ ఓ సత్య నారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు కు వినతి పత్రాన్ని అందించారు. రోడ్లపై గుంతలు లేకుండా మరమ్మతులు చేయాలని, విద్యుత్ శాఖ అధికారుల వేధింపులు లేకుండా చూడాలని కోరారు. విద్యుత్ అంతరాయం, విద్యుత్ షాట్ సర్క్యూట్ కాకుండా సిబ్బంది ని నియమించాలన్నారు. నిమర్జనం సమయంలో దోభిఘాట్ రోడ్డు నుండి గుండ్ల చెరువు వరకు సరైన లైటింగ్ సదుపాయాలు,మున్సిపాలిటీ నుండి క్రేన్ లను అందుబాటులో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేష సంపర్క ప్రముఖ్,ఆర్మూర్ నగర ప్రభారీ అల్జపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి,ఉపాధ్యక్షులు ప్రేమ్,సత్సంగ్ ప్రముఖ్ సచిన్,బజరంగ్ దళ్ సప్తహిక్ మిలన్ అరవింద్,బలోపాసన సాయి, ప్రచార ప్రముఖ్ అనురాగ్, రిషి, లింబాద్రి, శంకర్, మణికంఠ, నిఖిల్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రహరి గోడకు భూమిపూజా

**చొప్పదండి, ఆగస్టు 24 (జనంసాక్షి):**

చొప్పదండి పట్టణంలోని పురాణ దేవాలయం శివకేశవ దేవాలయం చుట్టు ప్రహారి గోడ నిర్మాణం కొరకు మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత–శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస–గంగయ్య, క్లబ్ అద్యక్షులు కస్తూరి వెంకటేశం చేతుల మీదుగా ఆలయ అర్చకులు జనగామ సత్యనారాయణ, సింహాచలం ప్రభాకార చార్యులు వేద మంత్రలతో భూమిపూజా చేశారు. ఆలయ ఆవరణలో అసాంఘిక సంఘటనలు జరుగుతుండంతో ప్రహారి నిర్మాణానికి ఆలయ అభివృద్ధి కమిటి మరియు నిర్వహణ కమిటి వివేకానందయూత్ క్లబ్ చోరువ తీసుకొని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చొప్పదండి పట్టణంలోని అతి పురాతనమైన శివకేశవ ఆలయం విశిష్టత గూర్చి ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకుపోయి ఇట్టి ప్రహారి నిర్మాణానికి ఆర్థిక నిధులు మంజారు కు చేయుటకు విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఇ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటి ఇప్పనపల్లి సాంబయ్య, గుర్రం మల్లారెడ్డి, కటకం భూమయ్య సార్, కౌన్సిలర్స్ కొట్టే అశోక్, చిల్ల శ్రవణ్, కనుమల్ల రాజశేఖర్, వడ్లూరి శ్యాం, సురేష్, కొత్త గంగారెడ్డి, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి,పిట్టల వెంకటేష్, ముద్దం తిరుపతి వివేకానంద యూత్ సభ్యులు సిరిపురం తిరుపతి, తాటిపెల్లి అంజయ్య,తెలుకుంట సత్యానారాయణ, దూస రాము, మంచాల మోహన్, మామిడాల నిరంజన్, గొల్లపెల్లి శ్రవణ్, గోవులకోండ ప్రదీప్,వడ్నాల తిరుపతి గోవులకొండ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.






# ఎల్లారెడ్డి ప్రజావాణిలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వినతి

**ఎల్లారెడ్డి ఆగస్ట్ 24 జనంసాక్షి**

ఎల్లారెడ్డి మండల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని,2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన 9 నెలల పెండింగ్ అల్పాహార బిల్లులను వెంటనే విడుదల చేయాలనికోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించే అల్పాహార పథకాన్ని మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలని, సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు.

వారి ప్రధాన డిమాండ్లు:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేయాలి. కోడిగుడ్లు, గ్యాస్, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలి. వంట కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి, గతంలో చేసిన అల్పాహార బిల్లులు, పారితోషిక బకాయిలు వెంటనే చెల్లించాలి,వంట కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలి,వంట కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించరాదు, ప్రతి విద్యార్థికి మెస్ చార్జీ రూ.25/–లు చెల్లించాలి. గ్యాస్ తో సహా వంటకు అవసరమైన సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని, అల్పాహార విధివిధానాలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హేమలత, అంబవ, సువర్ణ, గోపాల్, రజాక్, రాజు,తదితరులు పాల్గొన్నారు.



# వీణవంక ప్రజావాణిలో అధికారుల కరువు..

## సమయపాలన పాటించని అధికారులు

**వీణవంక ఆగస్టు 24 (జనంసాక్షి)**

వీణవంక మండల కేంద్రంలో ప్రజావాణి లో అధికారులు లేక ప్రజావాణి విలవిల పోయింది. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి, మండల స్థాయిలో ప్రజావాణిని నిర్వహిస్తుంటే,రెండో వారంలోనే నిర్ణీత సమయానికి అధికారులు సమయానికి రాక ప్రజావాణి ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ప్రజావాణిలో అధికారులు సమయపాలన పాటించక పోవడానికి పలు కారణాలు ఉన్న,అధికారులను సమన్వయం చేయడంలో మండల అధికారుల వైఫల్యం.ప్రజా సంక్షేమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా,ప్రజావాణి పనిచేస్తుంటే, అధికారులు మాత్రం ఎవరికి వారే ఉంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి,మండల స్థాయి ప్రజావాణి లో అధికారుల సమయపాలనపై ప్రత్యేకంగా నిఘ కనబరిచి,మండల ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సహకరించాలని కోరారు.

# ప్రజావాణి లో 16 ఫిర్యాదులు



**మల్యాల ఆగస్టు 24 (జనంసాక్షి)**

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.గంట వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 16 ఫిర్యాదులు వచ్చాయని 12 రెవెన్యూ,2 హౌసింగ్,2 పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని నోడల్ ఆఫీసర్ ఎంపిడిఓ స్వాతి తెలిపారు. మండల పరిధిలోనే పరిష్కరించగల సమస్యల కోసం ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో బాధ్యతగల అధికారులు పూర్తి సమయం ఉండకుండా మధ్యలోనే వెళ్లడం కొసమెరుపు కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎంపీడీఓ స్వాతి,తహసీల్దార్ శ్రీనివాస్,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ప్రతిభకు ప్రోత్సాహం.. ఆకట్టుకున్న ప్రత్యేక రాఖీలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (జనంసాక్షి):** బిక్కునూరు మండలంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో మానసిక దివ్యాంగుల విభాగానికి చెందిన పిల్లలు తమలోని నైపుణ్యాలను చాటుకున్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని కేంద్రంలో శిక్షణ పొందుతున్న మానసిక దివ్యాంగులకు వివిధ చిన్నచిన్న నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా వారు వివిధ డిజైన్లలో సుమారు 250 ప్రత్యేక రాఖీలను ఆకర్షణీయంగా తయారు చేశారు.వారు తయారు చేసిన రాఖీలను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ స్టాల్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కె.పీ. విజయలక్ష్మి, జిల్లా అధికారులు, డీపీఎంలు సందర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాఖీలు తయారు చేసిన



మానసిక దివ్యాంగుల పిల్లలను మనస్ఫూర్తిగా అభినందించారు. వారి సృజనాత్మకత, నైపుణ్యాలను జిల్లా అధికారులు ప్రశంసిస్తూ రాఖీలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు. దివ్యాంగ పిల్లలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.అనంతరం పునరావాస కేంద్రం పిల్లలు అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారితో పాటు పలువురు జిల్లా అధికారులకు రాఖీలు కట్టి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల ప్రతిభను వెలికితీసి, వారికి నైపుణ్య శిక్షణ అందిస్తూ స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్న పునరావాస కేంద్రం కార్యక్రమాన్ని అధికారులు అభినందించారు.

# మంత్రి శ్రీధర్ బాబు కు రాఖీ కట్టిన సిద్దిపల్లె సర్పంచ్ బంగారు కళ్యాణి



**కమాన్ పూర్ ఆగస్టు 24, ( జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు కమాన్ పూర్ మండల కేంద్రానికి రాగా రాఖీ పండుగ పురస్కరించు కొని ముందస్తుగా మంత్రి శ్రీధర్ బాబుకు సిద్ది పల్లె గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



## నాగుల మల్యాలలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

## లబ్ధిదారులను సన్మానించిన వైద్యుల అంజన్‌కుమార్

**కొత్తపల్లి, ఆగస్టు 24 (జనంసాక్షి):** ప్రజా పాలన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కరీంనగర్ నియోజకవర్గం కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గ్రామంలో ఇద్దరు లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మేగాని రాజు?సరిత, కట్ల సతీష్?మానస దంపతులు నూతన గృహాల్లోకి ప్రవేశించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్ హాజరై లబ్ధిదారులను సన్మానించారు. నూతన వస్త్రాలు, చీరె?సారె అందించి, గృహప్రవేశ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి అవినీతికి తావులేకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు.నూతన గృహాల లబ్ధిదారులు మేగాని రాజు?సరిత, కట్ల సతీష్?మానస ప్రభుత్వానికి, స్థానిక నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, వార్డు సభ్యుడు మురళి, రాజాగౌడ్, పెంట శేఖర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడుసుల్తానాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం పాట

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :** ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు నేడు మంగళవారం ఉదయం 10:00 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ తెలిపారు.ఈ వేలం పాటను జిల్లా ప్రొహిబిషన్ఎక్సైజ్ అధికారి పెద్దపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.వేలం పాటలో పాల్గొనదలిచిన వారు తమ ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని,అలాగే తాము బిడ్ చేయదలిచిన వాహనం విలువలో 50% శాతం ఈఎండీ మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.ఆసక్తి గల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సుల్తానాబాద్ ఎక్సైజ్ అధికారులు కోరారు.



# కొండాపూర్‌లో చెరువు కట్టకు గండి.. సుమారు 200 ఎకరాల్లో పంట నష్టం

## దెబ్బతిన్న చెరువు కట్ట, నీటమునిగిన పంటలను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్

**సిరికొండ, ఆగస్టు 24 (జనం సాక్షి):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలోని ఊర చెరువు కట్ట తెగిపోవడంతో సుమారు 200 ఎకరాల్లో వరి పంట నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చే దశలో ఉన్న పంట నీటిపాలవడంతో అన్నదాతలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్ సోమవారం కొండాపూర్ గ్రామాన్ని సందర్శించారు. దెబ్బతిన్న చెరువు కట్టను, వరద నీటితో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత ప్రభుత్వ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన దినేష్ కులాచారి పటేల్.. దెబ్బతిన్న చెరువు కట్టకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన కట్టను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. వరద నీటితో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టం అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించాలని కోరారు. చేతికొచ్చే దశలో పంట నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాలను నమోదు చేయాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంట బీమా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ఖఓఈఆఱ) వంటి పంట బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.రైతులకు నష్టం జరిగిన సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, చెరువు కట్ట మరమ్మతులు, పంట నష్టం అంచనా, పరిహారం విషయంలో వేగంగా



చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది : మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, ఆగస్టు 24, ( జనంసాక్షి )** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన బిరుదు మధుసూధన్ దంపతులను వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ దంపతులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, కానీ ఉద్యోగానికి మాత్రమే పదవీ విరమణ అని సామాజిక సేవకు కాదని ఆయన అన్నారు. శేష జీవితాన్ని సేవకు ఉపయోగించాలని, అలాగే ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# సర్వే నెం. 533 భూ వివాదం

## కోర్టు తీర్పును ధిక్కరించి సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి - బాధితుల ఆవేదన..



గన్నేరువరం, ఆగస్టు 24 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లా: గన్నేరువరం మండల కేంద్రంలో భూ వివాదానికి సంబంధించి సోమవారం ఉదయం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నారు. కోర్టు తమకు అనుకూలంగా తుది తీర్పునిచ్చినప్పటికీ, ఓ వ్యక్తి పాత పద్ధతిలోనే మళ్లీ హల్చల్ చేస్తూ సెల్ టవర్ ఎక్కడం స్థానికంగా కలకలం రేపింది.

**ఘటన నేపథ్యం - వివరాలు:వంశపారంపర్య భూమి**

గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బుర్ర రాందాస్ మరణానంతరం, ఆయన పేరిట ఉన్న సర్వే నంబర్ 533 లోని 30 గుంటల భూమిని ఆయన ముగ్గురు కుమారులు సమానంగా (మనిషికి 10 గుంటల చొప్పున) 2018లో విరసత్ పట్టా చేయించుకున్నారు. అప్పటి నుంచి వారు ఆ భూమిలో పునాస సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

**అక్రమ దౌర్జన్యం -తప్పుడు కేసులు:**

ఇదే క్రమంలో 2020 సంవత్సరంలో గ్రామానికి చెందిన న్యాత ప్రవీణ్ (తండ్రి పోచయ్య) ఆ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేయడానికి యత్నించగా, బాధితులు వ్యతిరేకించారు. దీంతో ప్రవీణ్.. బుర్ర మల్లయ్య, బుర్ర అంజయ్య, బుర్ర అరుణ, బుర్ర రాజ్ కోటి తదితరులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద తప్పుడు కేసులు బనాయించడంతో వారు జైలుపాలవ్వాల్సి వచ్చింది.

**న్యాయ పోరాటం - కోర్టు తీర్పు:**

దాదాపు ఐదు సంవత్సరాల పాటు బాధితులు కోర్టు చుట్టూ తిరిగి న్యాయపోరాటం చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ కేసులు తప్పుగా బనాయించినట్లు తేల్చి, 2025 నవంబర్ 2న ఆ కేసులను కొట్టివేసింది. అంతేకాకుండా, బాధితులకు అనుకూలంగా ఇంజెక్షన్ ఆర్డర్‌తో పాటు పూర్తి తీర్పు కూడా వెలువరించింది.

**నేడు సెల్ టవర్ ఎక్కిన వైనం:**

కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ, సోమవారం (ఆగస్టు 24) నాడు న్యాత ప్రవీణ్ అనే యువకుడు మళ్లీ పాత పద్ధతిని తెరపైకి తెచ్చాడు. సర్వే నెం. 533/ఇ/ఆ లోని 30 గుం. లు మొత్తం భూమి తనదేనంటూ గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. ఈ చర్య ద్వారా అతను ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితుల డిమాండ్:**

కోర్టు ద్వారా చట్టబద్ధంగా న్యాయం పొంది, ఐదేళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్న తమను అకారణంగా వేధిస్తూ, నిత్యం ఆందోళనలకు దిగుతున్న సదరు వ్యక్తిపై ప్రభుత్వం మరియు పోలీస్ అధికారులు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భూ బాధితులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై స్థానిక పోలీసులు , రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాలి మరీ .



## టీఎమ్ఎమ్ఆర్ ఆధ్వర్యంలో సర్పంచ్ మామిడి రాజుకు ఘన సన్మానం

ఇల్లంతకుంట ఆగస్టు 24(జనంసాక్షి) ఇల్లంతకుంట మండల కేంద్రంలో టీఎమ్ఎమ్ఆర్ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్, ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎమ్ఎమ్ఆర్ సభ్యులు మామిడి రాజును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని సర్పంచుల సమస్యలను సమన్వయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మామిడి రాజు కృషి చేయాలని ఆకాంక్షించారు.సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు.



## టీసీకి అదనంగా ఫీజు చెల్లించాలని డిమాండ్

### పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్,ఆగస్టు 24 (జనంసాక్షి) ముస్తాబాద్ మండల కేంద్రం లోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో సేవాలాల్ తండాకు చెందిన దారంసోత్ రవి నాయక్ ఫిర్యాదు చేశారు. రవికి ఇద్దరు కుమారులు ముస్తాబాద్ లోని నవ జ్యోతి పాఠశాలలో గత సంవత్సరంలో ఒక విద్యార్థి ఐదవ తరగతి మరొక విద్యార్థి మూడవ తరగతి చదివారు. నాణ్యమైన విద్య కోసం ఈ సంవత్సరం మా కుమారులను కరీంనగర్ లో చదివిస్తున్నామని రవి పేర్కొన్నారు.అయితే నవజ్యోతి పాఠశాలకు చెల్లించవలసి నటువంటి ఫీజులు అన్నీ కూడా చెల్లించామని వారికి ఎలాంటి బాకీ లేమన్నారు. ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టీసీ)కోసం నవజ్యోతి పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని అడగగా అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు వందల రూపాయలు చెల్లించి మీ సర్టిఫికెట్లు తీసుకెళ్లండని దురుసుగా మాట్లాడినట్టు పత్రికా ప్రకటనకు తెలియజేశారు.అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలలపై మండల విద్యాధికారి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వెల్లడించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### 65 ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 24( జనంసాక్షి) ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 65 ఫిర్యాదులు అందాయి.ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విక్టర్ సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాల్లో అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్, డీఆర్ఓ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## "మాదాసు" దంపతులను సన్మానించిన మంత్రి శ్రీధర్ బాబు

కమాన్ పూర్, ఆగస్టు 24, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ ఆదివరాహస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొనే వేలాది మంది భక్తులకు కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మాదాసు సుజాత రవీందర్, వారి కుమారులు నిఖిల్ చైతన్య, సాయి సిద్ధార్థ లు మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆదివరాహ స్వామి జయంతి ఉత్సవాలకు మాదాసు రవీందర్ సుజాత దంపతులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా మంత్రి శ్రీధర్ బాబు మాదాసు రవీందర్ సుజాత దంపతులను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, కాంగ్రెస్ నాయకులు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా దోపిడీని అరికట్టాలి: ఓరుగంటి ఆనంద్




కరీంనగర్ టౌన్, ఆగస్టు 24, ( జనంసాక్షి) ప్రైవేట్ విద్యా విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యాబాధితుల భారీ నిరసన చేపట్టారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఆధునిక డిజిటల్ విద్యను అందించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుల్లో తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రైవేట్ విద్యా దోపిడీపై చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడగల రవీందర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు, ప్రైవేటు విద్యాబాధితులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మల భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి

### మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించిన బీజేపీ నేతలు



గడ్కోల్, ఆగస్టు 24 (జనంసాక్షి): గడ్కోల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మల భాస్కర్ గారి మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో సోమవారం బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి పటేల్ గారు వారి కుటుంబాన్ని పరామర్శించారు. నిమ్మల భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతురాలి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. నిమ్మల భాస్కర్ కుటుంబ సభ్యులకు బీజేపీ నాయకులు తమ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్, సిరికొండ మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, బీజేపీ జిల్లా, మండల నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

# పెంచిన పని భారాలు తగ్గించాలి

## ఉద్యోగ భద్రత కల్పించాలి.. అంగీకరించిన అంశాలు అమలు చేయాలి ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24, ( జనంసాక్షి)**
పెంచిన పని భారాలను తగ్గించాలని, కార్మిక సంఘాలతో చర్చించి విధులు నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25న అన్ని ఆర్టీసీ డిపోలు, రీజియన్ కేంద్రాల్లో ఒక్కరోజు నిరాహార దీక్షలు నిర్వహించాలని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ, ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.ఏడేళ్ల తర్వాత ప్రభుత్వ చొరవతో ఆర్టీసీ యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి పలు అంశాలపై అంగీకరించినప్పటికీ, వాటి అమలులో జాప్యం చేస్తున్నారని ఫెడరేషన్ నాయకులు ఆరోపించారు. అంగీకరించిన అంశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పని భారాల తగ్గింపుపై జూన్ 20న జరిగిన చర్చల్లో డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలు, యాజమాన్యం చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని అంగీకరించినప్పటికీ కొన్ని డిపోల్లో అధికారులు ఏకపక్షంగా డ్యూటీలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డ్యూటీలను శాస్త్రీయ పద్ధతిలో రూట్ సర్వే చేసి రన్నింగ్ టైమ్‌ను నిర్ణయించి పని భారాన్ని తగ్గించాలని కోరారు.ఉద్యోగ భద్రతకు సంబంధించి డ్రంకన్ డ్రైవ్ నిబంధనల అమలుపై చర్చలు జరిగాయని తెలిపారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షను డ్యూటీకి రిపోర్ట్ చేసే ముందే నిర్వహించాలని, అవసరమైన వైద్య పరీక్షల అనంతరం చర్యలు తీసుకోవాలని కోరారు. మోటారు వాహన చట్టం-2019లోని సంబంధిత నిబంధనలను అమలు చేయడంతో పాటు ఆర్టీసీ కండక్ట్ రెగ్యులేషన్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు.2017 నుంచి పొందుతున్న అలవెన్సులను 80 శాతం పెంచి అమలు చేస్తామని ఏప్రిల్ 21న జరిగిన చర్చల్లో అంగీకరించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని నాయకులు తెలిపారు. దీంతో కార్మికులు నెలకు సుమారు రూ.31 కోట్లు నష్టపోతున్నారని, తక్షణమే అలవెన్సులు అమలు చేసి నష్టాన్ని నివారించాలని కోరారు.బ్రెడ్ విన్నర్ పథకం కింద నియమితులైన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, భవిష్యత్తులో నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టి వారి సర్వీసుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చర్చలు పూర్తయి రెండు నెలలు గడిచినా ప్రొసీడింగ్స్ కాపీని యూనియన్లకు ఇవ్వలేదని, వెంటనే అందించాలని కోరారు.అలాగే 2019లో నమోదైన పోలీసు కేసులను ఎత్తివేయాలని, జూనియర్ అసిస్టెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని, రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన 2017 బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్-2021 అమలు చేసి బకాయిలు చెల్లించాలని, పీఎఫ్ హయ్యర్ పెన్షన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు.ఆగస్టు 25న నిర్వహించే నిరాహార దీక్షల్లో యూనియన్ అనుబంధాలకు అతీతంగా ఆర్టీసీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

## మిలాద్ ఉన్ నబి జులూస్‌కు పోలీసుల అనుమతి..

### శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో సోమవారం మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా నగరంలోని మర్కజీ మిలాద్ కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, మదరసా అన్వార్ ఉల్ ఉలూమ్ కమిటీల పెద్దలతో పోలీసు కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసు కమిషనర్ మాట్లాడుతూ... మిలాద్ ఉన్ నబి పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. పండుగలకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా చివరి రోజు జరిగే జులూస్ శాంతియుతంగా జరగాలని ఆయన సూచించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సాధారణ షరతులతో కూడిన అనుమతి ఇస్తున్నామని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి , తిరుమల్ గౌడ్, మిలాద్ ఉన్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



## బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ ఎన్నిక

- కోఆర్డినేటర్ గా మాచర్ల శ్రీనివాస్, కో కో ఆర్డినేటర్ గా గరిగంటి కుమార్ ముదిరాజ్

**సుల్తానాబాద్,ఆగస్టు 24(జనంసాక్షి) :**
బీసీ ఎస్సీ ఎస్టీ పెద్దపల్లి జిల్లా కోఆర్డినేషన్ కమిటీని సోమవారం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కోఆర్డినేటర్ గా మాచర్ల శ్రీనివాస్, కో కోఆర్డినేటర్ గా గరిగంటి కుమార్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అంజి గౌడ్, రామ్మూర్తి, ఆకుల కుమార్ పటేల్, వెన్నంపల్లి శ్రీనివాస్,మామిడిపల్లి పరశురాం, భాస్కర్ యాదవ్, మాతంగి రేవంత్ మహారాజ్, కుక్క అవినాష్ మహారాజ్, క్యా దాసి రమేష్ మహారాజ్, వత్సాపురం రమేష్ మహారాజ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్ మాట్లాడుతూ నూతన కమిటీ జిల్లాలో బలోపేతం చేయాలని సూచించారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆలోచన విధానం మేరకు రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసి పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకం అయిన మాచర్ల శ్రీనివాస్ గరిగంటి కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీని గ్రామ గ్రామాన విస్తరించి బలోపేతం చేస్తామన్నారు.జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకుపోతామన్నారు.తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ దగాపై బీఆర్ఎస్ సమరభేరి కల్వకుంట్ల గోపాలరావు



**ముస్తాబాద్ ఆగస్టు 24 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం లో మాట్లాడుతున్న కల్వకుంట్ల గోపాలరావు సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్'బాకీ కార్డుల'తో హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి కేటీఆర్ గ్రామగ్రామాన ప్రజలకు కాంగ్రెస్మోసాన్ని తెలియజెప్పాలి. పార్టీ శ్రేణులకు పిలుపుఅధ్దగోలుగా హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చివంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి?తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణ ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదురాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు డిక్లరేషన్ల పేరుతో ప్రతి ఒక్క మాటను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆ పార్టీ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు.ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతి ఒక్కరినీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలు, ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిల వివరాలను ప్రజల ముందుంచాలని సూచించారు.విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్ మెంట్ ను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును అన్ని కాలేజీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకురావాలని సూచించారు. యువతకు ఏ విధంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందో ఇప్పటికే సరూర్‌నగర్‌లో నిర్వహించిన సభ, యువ సంగ్రామ సదస్సు ద్వారా ఎండగట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి సంబంధించిన కార్యాచరణలో భాగంగా మరోసారి యువతకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆటో డ్రైవర్లు, ఆడబిడ్డలు, అన్నదాతలు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ఒకే తరహా కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయా వర్గాల సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని అన్నారు.ఈ సందర్భంగా ఏడు రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గాల్లో మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు, దళితులు, బీసీలు, గిరిజనులు తదితర వర్గాలను ప్రత్యేకంగా కలుస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. హామీలను మాత్రమే కాకుండా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలను కూడా కార్యక్రమాల్లో ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు.హామీలతో పాటు 1000 రోజుల వైఫల్యాలనూ ఎండగట్టాలికేవలం హామీలు అమలు కాలేదనే అంశానికే పరిమితం కాకుండా.. ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం ఎన్ని రంగాల్లో వైఫల్యం చెందిందో, ఎన్ని రంగాల్లో అట్టర్‌ఫ్లాప్ పరిపాలన సాగించిందో ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలను గుర్తించి వాటిపై ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని సూచించారు.కేవలం హామీలు మాత్రమే కాదు.. వంద రోజుల వైఫల్య పాలన, వంద రోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంత అట్టర్‌ఫ్లాప్ అయిందో కూడా మనం చాలా పెద్ద ఎత్తున లేవనెత్తాల్సిన అవసరం ఉంది" అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, వాస్తవంగా జరిగిన పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.కొత్త తరం పిల్లలకు చేరువయ్యేలా ఈ కార్యక్రమాలు ఉండాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. సోషల్ మీడియాను ఒక పదునైన అస్త్రంగా ఉపయోగించుకుని వినూత్నమైన కార్యక్రమాలు, ప్రచార రూపాలతో కాంగ్రెస్ వైఫల్యాలను కొత్త తరానికి చేరేలా చేయాలని కోరారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కేటీఆర్ సూచించారు.ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రం, గ్రామం, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులన్నీ కదిలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలను ఎంత వినూత్నంగా నిర్వహించగలిగితే అంత వినూత్నంగా నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివిధ రూపాల్లో, వినూత్నంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు తమ చాతుర్యాన్ని ఉపయోగించాలని కోరారు.